




రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరి
	గురువారం	శుక్రవారం
కర్నూలు	6:33	5:05
నంద్యాల	6:29	5:05





ఉల్లి.. ఆశలు సన్నగిల్లి..!

- రాయితీ కోసం రైతుల పడిగాపులు
- 2019లో రూ. 6.45 కోట్ల నిధులు మంజూరు
- వెనక్కి పంపిన వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వంలో కదిలిన నిధుల మంజూరు ఫైలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉల్లి సాగు జూదంగా మారింది. అన్నీ అనుకూలిస్తే.. రైతులకు రూ.లక్షల్లో ఆదాయం వస్తుంది. లేదా అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తుంది. ఈ స్థితిలో ఆరేళ్ల క్రితం అంటే 2019లో ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం ఉల్లి రైతులను ఆదుకునేందుకు రాయితీని ప్రకటించింది. వెనువెంటనే జరిగిన ఆనాటి ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం రావడం ఉల్లి రాయితీని అటకెక్కించేసి రైతులకు తీరని ద్రోహం చేసింది. కూటమి ప్రభుత్వమైనా తమను ఆదుకోవాలని ఉల్లి రైతులు కోరుకుంటున్నారు.

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2019లో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రైతులు సాగు చేసిన ఉల్లి పంటకు కనీస ధర కూడా అందక రైతులు తీవ్రంగా నష్టపోయారు. వారిని ఆదుకునేందుకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్వింటం ఉల్లికి రూ700 మద్దతు ధరను ప్రకటించి వ్యాపారి అందించే ధరకు, తాము అందించే రాయితీని కలుపుకుని రైతుకు క్వింటంపై రూ.700 అందేలా ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు అందిన తక్షణమే పథకం అమలు కోసం వెంటనే నిధులను కూడా మంజూరు చేశారు. దాదాపు మొదటి విడత రూ.40 లక్షలను కొంత వరకు రాయితీ మొత్తాన్ని అందించారు. ఆ తర్వాత 2019లో ఎన్నికలు జరిగి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉల్లి రాయితీ పథకాన్ని అప్పటి సీఎం జగన్మోహన్ రెడ్డి అటకెక్కించేశారు. విడుదల చేసిన నిధులను వెనక్కి లాక్కున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రైతులు కర్నూలు మార్కెట్ కమిటీ కార్యాలయం చుట్టూ తమకు రావాల్సిన రాయితీ కోసం తిరుగుతూనే ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుల్లో ఆశలు చిగురించాయి. ఉల్లి రాయితీ నివేదికను కమిటీ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి పంపి నిధులను మంజూరు చేయిస్తామని ప్రజాప్రతినిధులు రైతులకు హామీ ఇస్తున్నారు.





ఈ రైతు పేరు రామేశ్వరరెడ్డి. 2019లో ఉల్లి రాయితీ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల కర్నూలు మార్కెట్ కమిటీ యార్డు కార్యాలయం వద్దకు మోకాళ్లరిగేలా తిరిగాడు. కూటమి ప్రభుత్వం వచ్చిందని ఇప్పటికైనా ఉల్లి రాయితీ అందించాలని అధికారులను వేడుకునేందుకు గత శనివారం కార్యాలయం వద్దకు వచ్చాడు. ప్రభుత్వం మంజూరు చేస్తే తప్పకుండా రాయితీని బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 9,740 మంది రైతులు ఉల్లి రాయితీ కోసం కర్నూలు మార్కెట్ కమిటీ కార్యాలయానికి క్యూ కడుతున్నారు.

మిగతా 6వ పేజీలో

న్యూస్ బాక్స్

ఇంటర్ పరీక్షలో ఇద్దరు డీబార్

- 401 మంది గైర్హాజరు

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం బుధవారం జరిగిన పరీక్షలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన ఇద్దరు విద్యార్థులు డీబార్ అయ్యారు. మద్దికెర లోని మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో ఇద్దరు విద్యార్థులపై మాల్ ప్రాక్టీసు కేసు నమోదు చేశారు. జిల్లాలో ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులు మొత్తం 20,925 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. 20,499 మంది పరీక్షకు హాజరు కాగా, ఇందులో 401 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐవో గురువయ్య శెట్టి వెల్లడించారు. ఆర్ఐవోతోపాటు డీవీ ఈవో పరమేశ్వర రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ లాలెప్ప, డీఈసీ కమిటీ సభ్యులు సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ఎన్నికల ప్రక్రియలో అపరిష్కృత సమస్యలపై ఫిర్యాదు చేయండి

- రాజకీయ పార్టీల నేతలకు ఎన్నికల కమిషన్ సూచన

కర్నూలు కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక, ఉప ఎన్నికల్లో అపరిష్కృతంగా ఉన్న అంశాలపై రాజకీయ పార్టీల నాయకులు ఏప్రిల్ 30వ తేదీలోపు ఫిర్యాదు చేయవచ్చని భారత ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్నికల ప్రక్రియ నిర్వహణను బలోపేతం చేసి పారదర్శకంగా నిర్వహించేందుకు అపరిష్కృతంగా ఉన్న పలు అంశాలను గుర్తింపు పొందిన రాష్ట్ర, జాతీయ పార్టీల ప్రతినిధులకు సూచించింది. ఈఆర్వో, జిల్లా ఎన్నికల అధికారి వద్ద ఫిర్యాదు చేసినా పరిష్కారం కానీ అంశాలపై ఏప్రిల్ 30 లోపు ఫిర్యాదు చేయాలని ఎన్నికల సంఘం సూచించింది.

ఇకపై బుధ, గురువారాల్లో..

- ఉన్నతాధికారుల ఆదేశాలతో పింఛన్ రీ వెరిఫికేషన్ మార్పు
- కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ స్కీం దివ్యాంగుల పెన్షన్ (6వేలు) రీవెరిఫికేషన్ సదరం క్యాంపును ఇక నుంచి ప్రతి బుధ, గురు, శుక్రవారాల్లో నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు తెలిపారు. సదరం క్యాంపునకు వచ్చే రోగులు సోమ, మంగళవారాల్లో ఓపీలు అధికంగా ఉండటంతో ఆర్థో, ఈఎన్‌టీ, సైక్రియాట్రీ, ఇతర కేసుల నుంచి వచ్చే దివ్యాంగులకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి బుధ, గురు, శుక్రవారాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ రీవెరిఫికేషన్ జరుగుతుందన్నారు. ఈ మార్పును దివ్యాంగులు గమనించి సోమ, మంగళవారాల్లో కాకుండా, బుధ, గురు, శుక్రవారాల్లో రావాలని సూచించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ కోసం వచ్చే వారు ఆధార్, రేషన్‌కార్డు, సదరం సర్టిఫికెట్‌ను తీసుకుని రావాలని సూచించారు.

పది మంది సీఐల బదిలీ



కర్నూలు క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ పరిధిలో పది మంది సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా సీఐల బదిలీలను చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. బదిలీ అయిన వారి వివరాలు ఇలా...

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
పి.చంద్రశేఖర్	రాయచోటి, అన్నమయ్య జిల్లా	వీఆర్, కర్నూలు
బీవీ చలపతి	ఆలూరు సర్కిల్	రాయచోటి, అన్నమయ్య జిల్లా
ఎల్.రవి శంకర్ రెడ్డి	ఉమెన్ పీఎస్, అన్నమయ్య జిల్లా	ఆలూరు సర్కిల్
జి.శంకర్ మల్లయ్య	ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు (ఔట్‌పోస్టు)	ఉమెన్ పీఎస్, అన్నమయ్య జిల్లా
ఓ.మహేశ్వర్ రెడ్డి	వీఆర్, కర్నూలు	ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు (ఔట్‌పోస్టు)
ఎస్కే మహ్మద్ అలి	మన్నూరు, అన్నమయ్య జిల్లా	సైబర్ సెల్, అన్నమయ్య జిల్లా
ఎస్.కుల్లాయప్ప	వీఆర్, కడప	మన్నూరు, అన్నమయ్య జిల్లా
ఎన్.రాజశేఖర్ రెడ్డి	వీఆర్, అనంతపురం	ఆదోని టూటౌన్ పీఎస్
ఓ.విజయభాస్కర్	వీఆర్, నంద్యాల	గోనెగండ్ల యూపీఎస్,
ఎ.గంగాధర్	గోనెగండ్ల యూపీఎస్	వీఆర్ కర్నూలు

కల్యాణం... నారసింహుని వైభోగం

- 'దిగువ' అహోబిలంలో ఘనంగా కల్యాణోత్సవం
- అశ్వవాహనంపై విహరించిన జ్వాలా నరసింహస్వామి



మాంగల్యం చూపుతున్న ఆలయ ప్రధాన అర్చకులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 12(ఆంధ్రజ్యోతి): నమో నారసింహా.. ఉగ్రం వీరం మహావిష్ణుం అంటూ భక్తజనం స్మరిస్తుండగా దిగువ అహోబిల క్షేత్రంలో లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం బుధవారం రాత్రి నయనానందకరంగా జరిగింది. అహోబిల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా దిగువ అహోబిలంలో వేదపండితులు ముందుగా స్వామి, అమ్మవారికి నవకలశ తిరుమంజనం, విశేష పూజలు నిర్వహించారు. తిరు నక్షత్రం సందర్భంగా అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామివారిని పుష్ప పల్లకిలో ఆలయ మాడవీధుల్లో ఉత్సవం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి స్వామివారి కల్యాణోత్సవానికి పట్టువస్త్రాలు, మహాప్రసాదాన్ని అధికారులు అహోబిల మఠం పీఠాధిపతికి అందజేశారు. క్షేత్రంలో ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లి అమ్మవారి కల్యాణం రమణీయంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ఆభరణాలు, వివిధ రకాల పూలమాలలతో పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలా అలంకరించి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. అనంతరం అర్చకులు శాస్త్రోక్తంగా ఎదుర్కోళ్లు నిర్వహించారు.

అశ్వ వాహనంపై శ్రీవారు

ఎగువ అహోబిలంలో జ్వాలా నృసింహస్వామి బుధవారం అశ్వ వాహనంపై విహరించారు. ఉభయదేవేరులతో కొలువైన స్వామివారిని విశేషంగా అలంకరించి సంప్రదాయబద్ధంగా ఉత్సవం నిర్వహించారు. ఆలయ యాగశాల ప్రాంగణంలో వేదమంత్రోచ్ఛరణాలతో అర్చకులు సాయంత్రం తొట్టి తిరుమంజనం నిర్వహించారు. రాత్రి జ్వాలా నరసింహ స్వామిని అశ్వ వాహనంపై కొలువుంచి మేళతాళాల మధ్య ఆలయ మాడవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

'ఎగువ'లో నేడు రథోత్సవం : బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో గురువారం వైభవంగా రథోత్సవం నిర్వహించనున్నారు. వేలాది మంది భక్తులు హాజరు కానుండడంతో నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేపట్టారు. దిగువ అహోబిల క్షేత్రంలో కాళింగనర్దనోత్సవం, శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రహ్లాద వరదస్వామి ఉత్సవమూర్తులకు అభిషేకం, తొట్టి తిరుమంజనం నిర్వహిస్తారు. ప్రహ్లాద వరదుడు అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు.



గజ వాహనంపై విహరిస్తున్న ప్రహ్లాద వరదస్వామి



దిగువ అహోబిలంలో తిరుమంజనం నిర్వహిస్తున్న వేదపండితులు

సర్వేలను పూర్తి చేయండి : కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న వర్క్ ఫ్రం హోం, ఎంఎస్ఎంఈ సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఎంపీడీవోలను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పలు కార్యక్రమాలకు సంబంధించి సర్వేలు నిర్వహించడం జరుగుతోందని నిర్దేశించిన గడువులోపు వాటిని పూర్తి చేయాలన్నారు. వర్క్‌ఫ్రం హోంకి సంబంధించిన సర్వేలో కౌతాళం, హొళగుంద, తుగ్గలి, పెద్దకడుబూరు మండలాలు వెనుకబడి ఉన్నాయని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కౌతాళం, గోనెగండ్ల మండలాల్లో ఎంఎస్ఎంఈ సర్వేలో పూర్తిగా వెనుకబడి ఉండటంతో ఎంపీడీవోలపై చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ సీఈవోను ఆదేశించారు. పీ-4 సర్వేలో కౌతాళం, ఆదోని, హొళగుంద, చిప్పగిరి, మంత్రాలయం, పత్తికొండ, పెద్దకడుబూరు మండలాలు వెనుకబడి ఉన్నాయన్నారు. సిటిజన్ ఈకేవైసీలో జిల్లా చాలా వెనుకబడి ఉందని, కర్నూలు అర్బన్, ఆదోని అర్బన్‌లలో ఎక్కువ పెండింగ్‌లో ఉందని, 20వ తేదీలోపు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల పరిష్కారాన్ని వారంలోపు పూర్తి చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, జడ్పీ సీఈవో నాసరరెడ్డి తదితరులు ఉన్నారు.



హామీలను అమలు చేయాలి

కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైసీపీ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న వైసీపీ నాయకులు

కర్నూలు న్యూసిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం యువతతోపాటు విద్యార్థులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ బుధవారం నగరంలో వైసీపీ యువత పోరు ర్యాలీ చేపట్టారు. శ్రీకృష్ణదేవరాయల కూడలి నుంచి కలెక్టరేట్ వరకు జరిగిన ర్యాలీలో జిల్లా అధ్యక్షుడితోపాటు మంత్రాలయం, ఆలూరు ఎమ్మెల్యేలు బాలనాగిరెడ్డి, వీరుపాక్షిలు ఉన్నారు. అనంతరం కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు విద్యార్థులు, యువకులకు అనేక హామీలు ఇచ్చారన్నారు. ఏమి అమలు చేయకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసి విద్య, వైద్య రంగాన్ని బలోపేతం చేయాల్సిన బాబు నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగ భృతికి రానున్న బడ్జెట్‌లో నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వాటని ప్రభుత్వమే నడపాలని, చేతకాకుంటే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యేలు సాయిప్రసాదరెడ్డి, కంగాటి శ్రీదేవి, ఎమ్మిగనూరు, కోడుమూరు ఇన్‌చార్జిలు బుట్టా రేణుక, ఆదిమూలపు సతీష్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ సుభాష్‌చంద్రబోసు, నాయకులు అహ్మద్ అలీఖాన్, రుద్రగౌడు, తెర్నేకల్ సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెట్కూరు సీఈవోగా వేణుగోపాల్

కర్నూలు కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా యువజన సంక్షేమ శాఖ సీఈవోగా డాక్టర్ వేణుగోపాల్ నియమితులయ్యారు. బుధవారం కలెక్టర్ రంజిత్ బాషాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యువజన సంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి చేస్తానని తెలిపారు. ఈయన గతంలో జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీగా పని చేశారు. కోయిలకుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేశారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఆర్థిక సాయం

- ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు
- ఎస్టీలకు రూ.75 వేలు
- పీవీటీజీలకు రూ. 1.00 లక్ష అదనపు ఆర్థిక సాయం
- కలెక్టర్ పి. రంజిత్ బాషా




మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ, ఎస్టీ గృహ నిర్మాణ లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం అందించనున్నట్లు కలెక్టర్ పి. రంజిత్ బాషా పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాష్ట్ర ప్రభుత్వం హౌసింగ్ లబ్ధిదారులకు అందజేయనున్న అదనపు ఆర్థిక సాయం అంశంపై కలెక్టర్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి డిసెంబరు 10, 2024 తర్వాత నిర్మాణంలో పురోగతిలో ఉన్న ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారులకు అదనపు ఆర్థికసాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవోఆర్‌టీ.నెం.9 ఈ నెల 10-3-2025 ద్వారా ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75వేలు, పీవీటీజీలకు రూ.1లక్ష అదనపు ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లాలో హౌసింగ్ కింద 39వేల వరకు ఇళ్లను మంజూరు కాగా, ఇందులో 22,590 ఇళ్లను పూర్తి చేసినట్లు తెలిపారు. ఇంకా 16,091 ఇళ్ల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. హౌసింగ్ పథకం కింద 9,446 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులు ఉన్నారని, ఇందులో 4,028 మంది ఎస్సీలు, 5,170 మంది బీసీలు, 248 మంది ఎస్టీలు ఉన్నారన్నారు. జిల్లాలో ఎస్సీ, బీసీలకు అదనంగా రూ.50వేలు, ఎస్టీలకు అదనంగా రూ.75వేలు, పీవీటీజీలకు అదనంగా రూ.1లక్ష ఇవ్వడం ద్వారా జిల్లాలో అదనంగా రూ.47.85 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. మరో రెండు రోజుల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, హౌసింగ్ ఇన్‌చార్జిల లబ్ధిదారుల ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న అదనపు ఆర్థిక సాయం గురించి వివరిస్తారన్నారు. ఇళ్ల స్థలం, ఇల్లు మంజూరు కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కిడ్నీలు జాగ్రత్త

- ఏటా 30 లక్షల మంది సీకేడీ బాధితులు
- అవగాహన పెంచుకోవాలంటున్న వైద్యులు
- ప్రతి ఏడాది కర్నూలు జీజీహెచ్‌కు 1800 ఓపీ రోగులు
- నేడు వరల్డ్ కిడ్నీ డే



కర్నూలు హాస్పిటల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మారిన జీవనశైలి, సరైన పోషకాలు లేని ఆహారం తీసుకోకపోవడం, సమయానికి తినకపోవడం, నీరు తక్కువగా తాగడం, ఊబకాయం, బీపీ, మధుమేహం లాంటివి కిడ్నీ సమస్యలకు కారణమవుతున్నాయి. మూత్రపిండాలు మన శరీరంలో ముఖ్యమైన అవయవం. మన శరీరంలో రక్తాన్ని శుద్ధి చేసి శరీరభాగాలకు సరఫరా చేయడంలో కిడ్నీల పాత్ర గణనీయమైంది. ఎప్పటికప్పుడు రక్తంలో చేరే మలినాలను వడబోసి మూత్రం రూపంలో బయటకు పంపి మనిషి ఆరోగ్యాన్ని కాపాడుతాయి కిడ్నీలు. భారతదేశంలో 16 శాతం మంది కిడ్నీ వ్యాధి బాధితులు ఉన్నారు. కిడ్నీపై అవగాహన పెంచేందుకు ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ ప్రతి ఏడాది మార్చి రెండో గురువారం వరల్డ్ కిడ్నీ డే నిర్వహిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది 30 లక్షల మంది ఈ వ్యాధితో మృతి చెందుతున్నారు. భారతదేశంలో 78 లక్షల మంది సీకేడీ (దీర్ఘకాలిక జబ్బు)తో బాధపడుతున్నారు. వారిలో ప్రతి సంవత్సరం 1.5 లక్షల మంది మరణిస్తున్నారు. కర్నూలు జీజీహెచ్ నెఫ్రాలజీ విభాగానికి ప్రతి ఏడాది 1800 మంది ఓపీ రోగులు వస్తున్నారు. ఇందులో 50 శాతం మంది డయాబెటిక్ రోగులు, 30 శాతం మంది బీపీతో బాధపడుతున్నవారు, 5 నుంచి 6 శాతం మంది పెయిన్ కిల్లర్స్ టాబ్లెట్స్ వాడే వారు కిడ్నీ జబ్బుల బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

ఈ ఏడాది థీమ్

ఆహారం, జీవనశైలి మార్పులు కిడ్నీలకు హానీ కలిగిస్తున్నాయి. ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజి ఈ ఏడాది మీ కిడ్నీలు బాగున్నాయా...? త్వరగా గుర్తించండి.. కిడ్నీ ఆరోగ్యాన్ని కాపాడుకోండనే నినాదం ఇచ్చింది.

దెబ్బతీస్తున్న పెయిన్ కిల్లర్స్

భారతదేశంలో ఏడు శాతం మంది పెయిన్ కిల్లర్స్ వాడి కిడ్నీలు పాడు చేసుకుంటున్నారు. నొప్పి నివారణ మందులను అతిగా వాడుతున్నప్పుడు కిడ్నీలు రక్తం వడపోత సామర్థ్యం తగ్గిపోతుంది. దీంతో రక్తపోటు పెరిగి కిడ్నీలు దెబ్బతింటాయి.

రెగ్యులర్‌గా పరీక్షలు

కిడ్నీ జబ్బు తొలిదశలో పెద్దగా లక్షణాలేవి కనిపించవు. అయినా ముందుగా గుర్తిస్తే జబ్బు రాకుండా చూసుకోవచ్చు. రక్తంలో యూరియా, క్రియాటిన్‌తోపాటు మూత్రాన్ని ఎప్పటికప్పుడు పరీక్షించినట్లయితే ప్రారంభంలోనే వ్యాధిని గుర్తించవచ్చు. కిడ్నీ వైఫల్యం నాలుగు దశలో జరుగుతుంది. మొదటి, రెండు దశలు రక్తం, మూత్ర పరీక్షలు చేస్తే తప్ప లక్షణాలు కనిపించవు. డయాబెటిస్, బీపీ, అధిక బరువు, గతంలో కిడ్నీలో రాళ్లు ఉన్నవారు ముందస్తు పరీక్షలు చేయించుకోవాలి. మూడో దశలో కాళ్ల వాపు, రక్తహీనత, బీపీ లక్షణాలు కనిపిస్తాయి. నాలుగో దశలో దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధిగా ఉంటుంది.

జాగ్రత్తలు

- మధుమేహం,బీపీ అదుపులో ఉండాలి.
- మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు, మూత్ర వ్యవస్థలో సమస్యలను పరిష్కరించు కోవాలి.
- మద్యం, ధూమపానం అలవాట్లను మానుకోవాలి.
- మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి.
- కిడ్నీ పనితీరు పది శాతం కంటే తక్కువకు పడిపోయినప్పుడు రోగికి డయాలసిస్ చేయించుకోవాలి.
- కిడ్నీలు ఆరోగ్యంగా ఉండడానికి ప్రతి రోజూ 7 నుంచి 8 గ్లాసుల నీటిని తాగాలి.
- జంక్‌ఫుడ్, నిల్వ ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి.
- ఆహారంలో ఉప్పును తగ్గించుకోవాలి.
- బరువును అదుపులో ఉంచుకోవాలి. ఊబకాయులకు కిడ్నీ జబ్బు ముప్పు 2-7 రెట్లు ఎక్కువ ఉంటుంది.

కిడ్నీ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించాలి



కిడ్నీ వ్యాధిని ప్రారంభదశలోనే గుర్తించాలి. ఇందుకు మూత్ర పరీక్ష, సీరం క్రియాటిన్ పరీక్ష చేయించుకోవాలి. 40 ఏళ్లు పైబడిన వారు, కుటుంబంలో కిడ్నీ వ్యాధి చరిత్ర ఉన్న వారు బీపీ, షుగర్ ఉన్న వారు సంవత్సరానికి ఒకసారి పరీక్షలు చేయించుకోవాలి.

– డా.కే. అనంతరావు, నెఫ్రాలజిస్టు, కిమ్స్ హాస్పిటల్, కర్నూలు



కర్నూలు జీజీహెచ్‌లోని నెఫ్రాలజిస్టులు

ఉప్పుతో ముప్పు



30 ఏళ్లు దాటిన తర్వాత కిడ్నీల పనితీరు ఏటా 10 శాతం తగ్గుతుంది. ఉప్పును ఎక్కువగా వాడితే సోడియం రక్తపోటును పెంచుతుంది. ఇది కిడ్నీలను దెబ్బతీస్తుంది. సాధారణ ప్రజలు 2 నుంచి 5 గ్రాముల ఉప్పు తీసుకోవాలి. సికేడీ రోగులు 2 గ్రాములలోపే తీసుకోవాలి.

– డా. సోమ అనంత్, నెఫ్రాలజీ విభాగాధిపతి, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

రక్తపోటును నియంత్రించుకోవాలి



రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవాలి. రక్తపోటు 130/80 కన్నా మించకుండా చూసుకోవాలి. 30 ఏళ్ల లోపు ఉన్న వారిలో బీపీ ఉంటే 90 శాతం కిడ్నీ జబ్బులు వచ్చే అవకాశం ఉంటుంది.

– డా.పీఎల్. వెంకట ఫక్కీరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ నెఫ్రాలజీ డిపార్ట్‌మెంటు, కర్నూలు జీజీహెచ్

నొప్పి మందులతో జాగ్రత్త



చీటికి మాటికి నొప్పి మందులను వేసుకోవద్దు. ఎలాంటి యాంటిబయాటిక్, పెయిన్ కిల్లర్స్ వైద్యుల సలహా లేకుండా వాడరాదు. ఇవి కిడ్నీలను దెబ్బతీస్తాయి. నెలలకు కిడ్నీ పరీక్ష చేయించుకోవాలి.

– డా. సిద్ధార్థ హెధూర్, నెఫ్రాలజిస్టు, మెడికవర్ హాస్పిటల్, కర్నూలు

ఉల్లి.. ఆశలు సన్నగిల్లి..!

(5వ పేజీ తరువాయి)

ఇదిలా ఉండగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతులకు మద్దతు ధర అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నదని ఇటీవల గుంటూరు మిర్చీ యార్డులో అభాండాలు వేయ డంపై ఉమ్మడి జిల్లా రైతులు మండిపడుతున్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో తమ కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తే.. ఐసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటన్నింటినీ నిలిపేయడమే కాకుండా ఉల్లి రాయితీని కూడా అందించకుండా ఎగనామం పెట్టలేదా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. తాజాగా తమకు అందాల్సిన ఉల్లి రాయితీని మళ్లీ తెప్పించేందుకు ఉమ్మడి జిల్లా ప్రతినిధులు సీఎం చంద్రబాబుపై ఒత్తిడి తేవాలని వారు కోరుతున్నారు.

రాయితీ అందేసరికి ప్రాణాలు పోయేలా ఉన్నాయి

జిల్లాలో ఉల్లి రైతులు కన్నీటి కడలి ఈదుతున్నారు. పెట్టుబడి ఖర్చు కాదు కదా కనీసం పొలం నుంచి కర్నూలు మార్కెట్ యార్డుకు ఉల్లిని తెచ్చినందుకు అయిన ఖర్చు కూడా వ్యాపారి నుంచి లభించ కపోవడం వల్ల రైతులు లబోదిబో మంటున్నారు. అప్పులు పేరుకుపోతుండటం, కుటుంబ జీవనం భారం కావడంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పరిస్థితిని గుర్తించిన ప్రభుత్వం ఆగస్టు నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు కర్నూలు యార్డులో ఉల్లిని విక్రయించిన రైతులకు క్వింటంపై రూ. 700 మద్దతు ధర అందించేందుకు ఆదేశాలు జారీ చేసింది. గిట్టుబాటు ధర అందించినందుకు రైతులు సంతోషించారు. రాయితీ డబ్బుల కోసం దరఖాస్తు చేసుకొనేందుకు వారు కర్నూలు మార్కెట్ కమిటీ కార్యాలయానికి క్యూ కట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గోనెగండ్ల, డోన్, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ, కోడుమూరు, కర్నూలు, నందికొట్కూరు, పాణ్యం, ఆదోని, ఆత్మకూరు తదితర 30 మండలాల్లో ఉల్లిని రైతులు భారీగా సాగు చేస్తున్నారు. ఒక ఎకరా ఉల్లి పంట సాగుకు రూ.20వేలు ఖర్చు అయితే.. ప్రస్తుతం పెట్టుబడి ఖర్చులు రూ.50వేలు నుంచి రూ.60వేలకు పెరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం అక్టోబరులో కర్నూలు మార్కెట్ యార్డుకు వేలాది క్వింటాళ్ల ఉల్లిని అమ్మకానికి రైతులు తీసుకుని వచ్చారు. వ్యాపారులు ఇదే సాకుగా చూపుతూ ధరను తగ్గించే ప్రయత్నం చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు సీఎం స్థాయిలో సీఎం చంద్రబాబు ఉల్లి రైతుల కష్టాలు తీర్చాలని, వెంటనే అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాలని మంత్రులను ఆదేశించారు. మంత్రి టీజీ భరత్‌తో పాటు జలవనరుల శాఖ మంత్రి ఉల్లి మార్కెట్ యార్డుకు చేరుకుని వ్యాపారులు, అధికారులతో చర్చలు జరిపారు. దీంతో వ్యాపారులు దిగివచ్చారు. రైతులకు గిట్టుబాటు ధర అందడంతో వారు సంతోషించారు.

జిల్లాలో ఉల్లి రాయితీ వివరాలు (క్వింటాళ్లలో)

నెల	అర్హులు	విక్రయించిన ఉల్లి
ఆగస్టు	260	15798
సెప్టెంబరు	1014	18774
అక్టోబరు	1361	14799
నవంబరు	2449	169263
డిసెంబరు	1703	10651
జనవరి	1515	24390
ఫిబ్రవరి	1438	59462





రైతులకు అందాల్సిన రాయితీ రూ.6.45 కోట్లు.. ఇచ్చింది రూ.40 లక్షలే..

2019లో ఉమ్మడి జిల్లాలోని ఉల్లి రైతులు ధర పతనమై తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్నారు. ఆ సమయంలో 3,47,911 క్వింటాళ్ల ఉల్లిని రైతులు వ్యాపారులకు విక్రయించారు. రైతులకు క్వింటానికి వ్యాపారులు అందించిన మొత్తం కేవలం రూ.200 నుంచి రూ.400 మధ్యనే. రైతుల కన్నీటి వ్యథను తొలగించేందు కోసం అప్పట్లో ప్రభుత్వం ఉల్లి రాయితీ అందించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. క్వింటానికి రూ.700 మద్దతు ధరను ప్రకటించింది. క్వింటానికి వ్యాపారి రూ.300 చెల్లిస్తే.. ప్రకటించిన మద్దతు ధర ప్రకారం రూ.400 రాయితీగా అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం రాయితీ కోసం అప్పట్లో 9,740 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ప్రభుత్వం నుంచి రూ.6.45 కోట్లు రాయితీగా అందించాల్సి ఉందని మార్కెట్ కమిటీ అధికారులు నివేదికను ప్రభుత్వానికి అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోడుమూరులో పర్యటించిన సమయంలో 40 లక్షల దాకా రాయితీని రైతులకు అందించారు. 2019 ఆగస్టులో 260 మంది రైతులు 15,798 క్వింటాళ్లను విక్రయించారు. సెప్టెంబరులో 1,014 మంది రైతులు 18,774 క్వింటాళ్ల ఉల్లిని విక్రయించారు. అక్టోబరులో 1361 మంది రైతులు 14,799 క్వింటాళ్లను, నవంబరులో 2,449 మంది రైతులు 1.69 లక్షల క్వింటాళ్లను, డిసెంబరులో 1,703 మంది రైతులు 10,651 క్వింటాళ్లను అమ్ముకున్నారు. జనవరి నెలలో 1,515 మంది రైతులు 24,390 క్వింటాళ్లను, ఫిబ్రవరిలో 1438 మంది రైతులు 59462 క్వింటాళ్ల ఉల్లిని కర్నూలు మార్కెట్ యార్డులో విక్రయించారు. మొత్తం 3.47 లక్షల క్వింటాళ్లకు గాను ప్రభుత్వం రూ.6.45 కోట్లు 9,740 మంది రైతులకు రాయితీగా అందించాలని ప్రభుత్వానికి ఆనాటి కర్నూలు మార్కెట్ కమిటీ అధికారులు నివేదిక పంపించారు.

ఉల్లి రాయితీని రైతుకు అందించేందుకు కృషి



ఉల్లి రైతులకు 2019లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రాయతీని అందించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ రాగానే మంజూరైన నిధులను వెనక్కి తీసేసుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా రైతులు రాయితీ డబ్బుల కోసం కర్నూలు మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. కూటమి ప్రభుత్వం రావడం వల్ల రాయితీ డబ్బులు అందించేందుకు జిల్లా ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రభుత్వం నుంచి నిధులను మంజూరు చేయిస్తాం.

– పెరుగు పురుషోత్తంరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్

ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం



జిల్లా ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రభుత్వానికి రైతులు చెల్లించాల్సిన ఉల్లి రాయితీ కోసం ప్రభుత్వానికి నివేదికను పంపిస్తాం. ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుంటాం. ఆందోళన వద్దు.

– జయలక్ష్మి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ

ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకానికి దరఖాస్తు చేసుకోండి

మార్చి 31 చివరి తేదీ





వెల్దుర్తి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకానికి ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. భారతదేశంలోని టాప్-500 కంపెనీలలో యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడానికి అవకాశం కల్పిస్తోంది. ఇందుకు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది..

అర్హులు..: భారతీయులై ఉండాలి. అప్లికేషన్ చేసే సమయానికి సర్టిఫికెట్ ప్రకారం వయస్సు 21 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండకూడదు. ఫుల్‌టైం ఉద్యోగిగా ఎక్కడ ఉండకూడదు. ఫుల్‌టైం ఎడ్యుకేషన్ ప్రస్తుతం చేస్తూ ఉండకూడదు. ఆన్‌లైన్ లేదా డిస్టెన్స్ ఎడ్యుకేషన్ చేస్తున్న వారు అర్హులు. ఎస్ఎస్‌సీ, పాలిటెక్నిక్, ఐటీఐ, బీఏ, బీఎస్‌సీ, బీఫార్మా, బీబీఏ వంటి ఏదైనా డిగ్రీ ఉండాలి.

దరఖాస్తు విధానం

1. రిజిస్ట్రేషన్ ఇన్ పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ పోర్టల్ (పీఎం ఇంటర్న్‌షిప్.ఎంసీఏ.జీవోవీ.ఇన్)
2. ఇంటర్న్‌షిప్ అప్లికేషన్ ఇన్ పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ పోర్టల్
3. యాక్సెప్ట్ ఫ్రమ్ కంపెనీస్

దరఖాస్తుకు అవసరమయే డాక్యుమెంట్లు..

1. పదవ తరగతి సర్టిఫికెట్ మరియు పైన తెలిపిన డిగ్రీ సర్టిఫికెట్లు
2. ఆధార్ కార్డు నెంబరు 3. ఆధార్‌కార్డు లింక్ అయిన మొబైల్ నెంబరు 4. ఈమెయిల్ ఐడీ వెరిఫికేషన్

నీలిమ..సహాయ కార్మిక అధికారి

సొంత రాష్ట్రంలో దగ్గర్లో ఉన్నటువంటి స్థానంలో కూడా దరఖాస్తు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆ దరఖాస్తు మాకు పంపాలి. సెలక్షన్ అయిన వారి ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. నేరుగా వారి లాగిన్ ఓపెన్ చేసి ఆన్‌లైన్‌లో సెలక్షన్ ఆర్డర్ కాపీని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ప్రయోజనాలు..

1. అర్హత సాధించిన వారికి జాయినింగ్ ముందు కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.6 వేలు నేరుగా ఆధార్ కార్డు లింక్ అయిన బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి.
2. ఇంటర్న్‌షిప్ ప్రారంభమైన తర్వాత ప్రతి నెలా ఏ కంపెనీలో జాయిన్ అవుతారో ఆ కంపెనీ ద్వారా రూ.500 నగదు ఇంటర్న్‌షిప్ చేస్తున్న వారి బ్యాంకు ఖాతాలో జమ అయిన తరువాత కేంద్ర ప్రభుత్వం ద్వారా మిగిలిన రూ.4500 నగదు నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి. మొత్తం ఒక నెలకు రూ.5 వేలు నగదు బ్యాంకు ఖాతాలో ఇంటర్న్‌షిప్ చేస్తున్న వారి ఖాతాలో జమ అవుతాయి.
3. జాయిన్ అయిన సంవత్సర కాలంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన

పథకాలు రెండు కూడా సెలక్ట్ అయిన వారి పేరుపై ప్రభుత్వం ఆటోమేటిగ్గా మొదలుపెడుతుంది. ఇది సంవత్సరకాలం ఇంటర్న్‌షిప్ చేస్తున్న వారిపై ఉంటుంది.

4. ఒక సంవత్సరం పూర్తయిన తర్వాత కంపెనీ వారిచ్చే సర్టిఫికెట్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాలలో ప్రాధాన్యత ఉంటుంది.

సిరిమల్లె

- లాభదాయకంగా మల్లెపూల సాగు
- రోజుకు 230 కేజీల దిగుబడి
- పది రోజులకే రూ.లక్ష ఆదాయం
- ఆదర్శంగా నిలిచిన కౌలు రైతు ఉసేన్‌బాషా



చాగలమర్రి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన కౌలు రైతు ఉసేన్‌బాషా మల్లె పూల సాగులో రికార్డు సాధించి ఆదర్శంగా నిలిచాడు. రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని మల్లె పూల తోట సాగు చేశాడు. రెండు ఎకరాలకు రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టాడు. రోజుకు 250 కేజీల మల్లె పూలు కోతకు వస్తున్నాయి. కేజీ రూ.350 పలకడంతో పది రోజుల్లోనే రూ.4 లక్షలు వచ్చింది. కౌలు, కూలీలు పోను రూ.లక్ష ఆదాయం వచ్చింది. తన కష్టానికి తగ్గ ఫలితం వచ్చిందని కౌలు రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. ఈ ఏడాది మొదటి కోతలోనే రూ.లక్ష ఆదాయం వచ్చిందని తెలిపారు. గత ఏడాది సరైన ధర లేక మల్లె పూలతో నష్టపోవాల్సి వచ్చిందని, ఈ ఏడాది మొదటి కోతలోనే దిగుబడి అధికంగా రావడంతోపాటు ధర కూడా ఆశించిన స్థాయిలో ఉండటంతో మంచి ఆదాయం వచ్చిందని అన్నారు.



చాగలమర్రిలో మల్లెపూలు కోస్తున్న మహిళా కూలీలు

దిగుబడి బాగుంది



రెండు ఎకరాల్లో మల్లె తోట సాగు చేశా. ఏటా ఎకరాకు లక్ష లాభం వస్తోంది. మంచి ధర ఉంటే రూ.2 లక్షలు పైగా వస్తుంది. తోటలను కంటికి రెప్పలా చూసుకోవాలి. తరచూ నీటిని అందిస్తూ తెగుళ్లను నివారించి పంటను కాపాడుకోవాలి. ఎనిమిది నెలల పాటు దిగుబడి వస్తుంది. చాగలమర్రిలో వ్యాపారులు పూలమండీలు ఏర్పాటు చేయడంతో మార్కెట్‌కు ఇబ్బంది లేదు. మొదటి కోతలోనే పెట్టుబడి, కౌలు పోగా రూ.లక్ష ఆదాయం వచ్చింది.

– ఉసేన్‌బాషా, కౌలు రైతు, చాగలమర్రి

సహకార సంఘాలను ఆదుకుంటాం

• ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘం చైర్మన్ బీఎస్ నవీన్ కుమార్

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమం, గ్రామాల్లోని సహకార సంఘాల బలోపేతం వంటి కార్యక్రమాలను వేగవంతం చేసి వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘం చైర్మన్ బీఎస్ రవికుమార్ ప్రకటించారు. బుధవారం కర్నూలు నగరంలోని మత్స్య సహకార సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను, వివరించారు. మత్స్య సహకార సంఘాల్లో సభ్యులకు త్వరలోనే బైలాలను తెలుగులోకి అనువదించి పంపిణీ చేస్తామని ప్రకటించారు. డైరెక్టర్లు శేఖర్, నాగేషులు, శ్రీనివాసులు, మల్లీశ్వరుడు, మద్దిలేటి, నగేష్ పాల్గొన్నారు.

పుట్టెడు దుఃఖంలోనూ పరీక్షకు..

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కుమార్తెను వైద్యురాలిగా చూడాలనుకున్న తండ్రి ఆకస్మికంగా మృతి చెందాడు. ఆ దుఃఖాన్ని దిగమింగుకుని తండ్రి కష్టాన్ని గుర్తు చేసుకుంటూ, ఆయన ఆశను నిజం చేసేందుకు కూతురు పరీక్ష కేంద్రానికి వెళ్లింది. ఈ ఘటన నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన విద్యార్థిని లక్ష్మీదేవి వైపీపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ విభాగంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. విద్యార్థిని తండ్రి నాగేశ్వరరావు మంగళ వారం రాత్రి మృతి చెందాడు. అంత్యక్రియలకు ముందు విద్యార్థిని లక్ష్మీదేవి పుట్టెడు దుఃఖంతో పరీక్షా కేంద్రానికి వెళ్లి ఫిజిక్స్ పరీక్ష రాసి వచ్చింది. ప్రిన్సిపాల్ మల్లేశ్వరరెడ్డి, అధ్యాపకులు విద్యార్థిని లక్ష్మీదేవికి ధైర్యం చెప్పి ప్రోత్సహించారు.


పరీక్షకు హాజరైన విద్యార్థిని లక్ష్మీదేవి

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

వెలుగోడు మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కానిస్టేబుల్ రవికుమార్ (40) గుండెపోటుతో మృతి చెందారు. 2009 బ్యాచ్‌కు చెందిన రవికుమార్ వెలుగోడు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవలే చాగలమర్రి పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అయితే ప్రస్తుతం ఆయన కుటుంబం వెలుగోడులోనే నివాసం ఉంటోంది. బుధవారం సాయంత్రం వెలుగోడులోని నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. రవికుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామమైన ఆళ్లగడ్డకు తరలించారు.


రవికుమార్ (ఫైల్)

మహిళ ఆత్మహత్య

బండిఆత్మకూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతజూటూరు గ్రామానికి చెందిన కృష్ణవేణి (40) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. బుధవారం ఉదయం కడుపునొప్పి తాళలేక రసాయనిక ద్రవం తాగి, తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను బంధువులు నంద్యాల ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ మృతి చెందిదారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కృష్ణవేణికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

బేతంచెర్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని మధులత (16) ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన తిరుమలేష్‌రెడ్డి, లావణ్య దంపతుల పెద్ద కుమార్తె మధులత బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు విద్యార్థిని తల్లిదండ్రులు తెలిపారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళి అర్పించారు. అయితే తల్లిదండ్రుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.


మధులత(ఫైల్)

ట్యాంకుపై నుంచి దూకి యువకుడు..

సంజామల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఓవర్ హెడ్ ట్యాంకుపై నుంచి దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ఎగ్గోని గ్రామంలో బుధవారం జరిగింది. కడప జిల్లా ముద్దనూరు మండలం ఉప్పలూరు గ్రామానికి చెందిన కర్నాటి హర్షవర్ధన్ రెడ్డి (30) ఎగ్గోని గ్రామంలో ఉన్న తన సోదరి శ్రావణి వద్దకు వచ్చి వెళ్తుండేవాడు. హర్షవర్ధన్ మద్యానికి బానిసై లివర్ పాడైపోయింది. నిత్యం ఆసుపత్రిలో చూపించుకుంటున్నా నయం కాకపోవడంతో గతంలో రెండు పర్యాయాలు ఆత్మహత్యాయత్నం చేశారు. రెండు రోజుల క్రితం ఎగ్గోనిలోని సోదరి శ్రావణి ఇంటి వద్దకు వచ్చిన హర్షవర్ధన్ రెడ్డి గ్రామం వెలుపల ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు ఎక్కి పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సోదరి శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు.

అప్పుల బాధతో రైతు..

కౌతాళం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలం లోని ఎరిగేరి పంచాయతీలోని మజరా గ్రామ మైన లక్ష్మీనగర్‌కు చెందిన ఓ రైతు బుధవారం అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలివీ.. ఉలిగప్ప(60) తనకున్న రెండు ఎకరాల పొలంతో పాటు కౌలుకు మరో 8 ఎకరాలు తీసుకుని మిరప సాగు చేశారు. గిట్టుబాట ధర లేకపోవడంతో పెట్టుబడులు కూడా రాలేదు. అప్పులు అంతకంతకు పెరిగిపోయాయి. రూ.5 లక్షల అప్పులు ఎలా తీర్చా లోనని మనస్తాపానికి గురయ్యారు. బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఉలిగప్పకు ఆరుగురు ఆడపిల్లలు సంతానం. ఉలిగప్ప భార్య ఆనందమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు కౌతాళం ఏఎస్ఐ రమణారెడ్డి తెలిపారు.


ఉలిగప్ప(ఫైల్)

ఎల్‌టీ క్యాడర్‌ను జోనల్‌గా మార్చాలి

కర్నూలు హాస్పిటల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ల్యాబ్ టెక్నీషియన్ క్యాడర్‌ను జిల్లా క్యాడర్ నుంచి జోనల్ క్యాడర్‌గా మార్చాలని ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రఘుబాబు డిమాండ్ చేశారు. గురువారం ల్యాబ్ టెక్నీషియన్స్ డే సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని విభాగాల్లో కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్స్‌కు సమాన పనికి సమాన వేతనం వంద శాతం గ్రాస్ వేతనం ఇవ్వాలన్నారు. 2022 నుంచి పీహెచ్‌సీ, ఓపీహెచ్‌సీలలో కొత్త పరికరాలు సమకూర్చారు. 63 రకాల పరీక్షలు చేసి ఒత్తిడి నెలకొందని, వీటితోపాటు టీబీ, హెచ్ఐవీ పరీక్షల నిర్వహణ ఎల్‌టీలు చేయడం కష్టంగా ఉందన్నారు. అందువల్ల రెండో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు మంజూరు చేసి భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.


రఘుబు(ఫైల్)

దోపిడీకిపోయి దొరికిపోయారు..!

• చిత్తూరు ఘటనలో నంద్యాల జిల్లా నేరస్థులు


దుండగులను చితకబాదుతున్న స్థానికులు


దుండగులను వ్యాన్‌లో తీసుకెళ్తున్న పోలీసులు

నంద్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కేంద్రంలో ఓ దొంగల ముఠా బుధవారం హల్ చేసింది. ఈ ఘటనలో నంద్యాల జిల్లా దొంగలు ఉండడంతో ఇక్కడ కలకలం రేగింది. సదరు ముఠాలోని కీలక నేరస్థుడు సుబ్రహ్మణ్యం అలియాస్ మాణ్యాలు నంద్యాల జిల్లా కేంద్రానికి చెందిన వాడు. ఇతనితోపాటు నంద్యాలకు చెందిన నవీన్ అనే మరో దొంగ కూడా పోలీసులకు పట్టుబట్టాడు.

ఫర్నీచర్ షాపు పేరుతో రూ.కోట్లలో అప్పులు

నంద్యాల జిల్లా కేంద్రంలో ఓ ఫర్నీచర్ దుకాణం పెట్టాడు. కంతుల వారీగా ఫర్నీచర్ వ్యాపారానికి తెరలేపాడు. ఈ క్రమంలో పెద్దఎత్తున ఖాతాదా రులు నగదు చెల్లించారు. సదరు నగదుతో రియల్ ఎస్టేట్ తదితర వ్యాపారాలు చేసి సొమ్ము చేసుకు న్నారని సమాచారం. అయితే ఏం జరిగిందో.. ఏమో కానీ.. ఆ తర్వాత.. రూ. కోట్లలో ఐపీ పెట్టి 2013 తర్వాత ఇక్కడి నుంచి చిత్తూరుకు మకాం మార్చా రని తెలిసింది. అక్కడ కూడా ఇదే తరహాలో పలు రకాలు వ్యాపారులు చేసి రూ.కోట్లలో అప్పులు చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే దొంగత నాలకు తెరలేపారు. తాజాగా చిత్తూరులో దొంగతనానికి వ్యూహం రచించారు.

వ్యాపార సమయంలో పరిచయం..

చిత్తూరులో దొంగతనం చేయడానికి వెళ్లిన యజమానితో సదరు నేరస్థుడికి పలు వ్యాపార సమయాల్లో పరిచయం ఏర్పడినట్లు తెలుస్తోంది. సదరు కిడ్డీ షాపు యజమాని కదలికలపై రెక్కి నిర్వహించి ఈ దొంగతనానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఇందులో ఇరువురి మధ్య ఏమైనా వ్యాపార లావాదేవీల్లో తేడాలు ఉన్నాయా అన్న అనుమానాలు లేకపోలేదు.

కీలక నేరస్థుడిపై 2005 లోనే హత్య కేసు

సదరు ముఠా లోని కీలక నేరస్థుడు సుబ్రహ్మ ణ్యంది నంద్యాల జిల్లా కేంద్రం లోని ఓ కాలనీ. అయితే ఇదే కాలనీలోని ఓ రాజకీయ నాయకుడికి ప్రధాన అనుచరుడిగా ఉండేవాడు. సదరు నేరస్థుడికి ఆ నాయకుడు అండగా ఉండేవాడు. అయితే తనకు ఎదురే లేకుండా ఉండాలని సదరు నాయకుడిని కూడా అంతమొందించాడు. కర్నూలు జిల్లాలోని ఓ ప్రాంతానికి చెందిన నేరచరిత్ర కలిగిన ముఠాకు సుపారి ఇచ్చి హత్య చేయించాడు. 2005లో జరిగిన ఈ ఘటన అప్పట్లో కలకలం రేపింది. దీంతో అప్పట్లో సదరు నేరస్థుడిపై హత్య కేసు నమోదైంది. ఇక అప్పటి నుంచి ఆ నేరస్థుడంటే నగరంలో అందరికీ భయం అనే చర్చ కొనసాగింది. ఇదే భయాన్ని ఆసరాగా చేసుకొని ఆ నేరస్థుడు వ్యాపారాల్లో దిగాడు.

పోలీసుల దర్యాప్తు ముమ్మరం

ఉదయం నుంచి చిత్తూరు దొంగల ముఠా కలకలం రేగడంతో జిల్లాల పోలీసులు సదరు ముఠా దొంగల కోసం దర్యాప్తు ముమ్మరం చేశారు. అక్కడి పోలీసులు ఐదుగురు నిందితుల్ని అదుపులోకి తీసుకోగా మరికొందరు పరారయ్యారు. పరారైన వారిలో ఒకరు నంద్యాల జిల్లా కేంద్రంలోని తన సమీప బంధువైన ఆటో డ్రైవర్‌కు ఫోన్ చేశాడు. ఈ నేపథ్యంలో పసిగట్టిన పోలీసులు ఫోన్ చేసిన నేరస్థుడితో పాటు.. ఆటోడ్రైవర్ కోసం దర్యాప్తు ముమ్మరం చేశారు.

'బనవాసి' విద్యార్థినులకు అస్వస్థత

• తీవ్ర జ్వరంతో బాధపడుతున్న విద్యార్థినులు
• పరామర్శించిన సబ్ కలెక్టర్


ఆసుపత్రిలో విద్యార్థినులను పరామర్శిస్తున్న సబ్ కలెక్టర్

ఎమ్మిగనూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌మీడియెట్ పరీక్ష వేళ సమయంలో మండల పరిధిలోని బనవాసి గురుకుల కళాశాల విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. మండలంలోని బనవాసి ఏపీఆర్‌జేసీ గురుకుల బాలికల కళాశాలలో చదువుతున్న మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు ఉదయం దాదాపు 25 మంది వరకు తీవ్ర జ్వరానికి గురయ్యారు. దీంతో స్థానికంగా ఉన్న వైద్య సిబ్బంది వారికి ప్రాథమిక చికిత్స అందించారు. దీంతో కొంత మందికి జ్వరం తగ్గుముఖం పట్టగా మరో పది మంది విద్యార్థినులకు జ్వరం తగ్గకపోవడంతోపాటు అస్వస్థతకు గురయ్యారు. దీంతో కళాశాల సిబ్బంది విద్యార్థినులను మధ్యాహ్నం 3గంటల సమయంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రి డ్యూటీ వైద్యులు డాక్టర్ మల్లికార్జున విద్యార్థినులకు చికిత్స అందించారు. సమాచారం తెలుసుకున్న సబ్ కలెక్టర్ మౌర్యాభరద్వాజ్ హుటాహుటిన ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకొని విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో మాట్లాడి జ్వరం రావడానికి గల కారణాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జ్వరం, జలుబు వల్ల విద్యార్థినులు కొంత ఇబ్బందికి గురయ్యారని అన్నారు. అయితే విద్యార్థినులకు ఎలాంటి ప్రమాదం లేదని, బాగానే ఉన్నారని తెలిపారు. విద్యార్థినులకు మంచి వైద్యం అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కళాశాల సిబ్బందితోపాటు, వైద్య, రెవెన్యూ సిబ్బంది ఆస్పత్రిలో ఉండి విద్యార్థినులను పర్యవేక్షిస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా ఎండలు ఎక్కువగా ఉండడంతో కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు రేకుల షెడ్డులో ఉన్న డార్మెటరీల్లో చదువుకోవడం, చెట్ల నీడలోని వేడిగాలులకు కూర్చోవడం వల్ల అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది.

భవన నిర్మాణానికి 24 గంటల్లో అనుమతి

• ప్రాంతీయ పట్టణ ప్రణాళిక జోనల్ డీడీ విజయభాస్కర్

కర్నూలు న్యూసిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాల్లో భవన నిర్మాణ అనుమతుల కోసం రోజులు తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేదని, దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లో అనుమతి పొందవచ్చని ప్రాంతీయ పట్టణ ప్రణాళిక జోనల్ డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్ స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని నగర పాలక సమావేశ భవనంలో ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల పట్టణ ప్రణాళికా విభాగ అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, లైసెన్స్‌డ్ ఇంజనీర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ భవన నిర్మాణాలకు అనుమతుల్లో జాప్యాన్ని నిరోధిస్తూ ప్రభుత్వం కొత్తగా పథకం తెచ్చిందన్నారు. తద్వారా దరఖాస్తు పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన గంటల వ్యవధిలో అనుమతులు పొంది పనులు ప్రారంభించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ శోభన్‌బాబు, జిల్లా డీటీసీపీఓ శశిలత పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విజయభాస్కర్

వైసీపీ దొంగాటను ప్రజలు నమ్మరు

• నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్


హుశేనాపురంలో జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఓర్వకల్లు మార్చి 12, (ఆంధ్రజ్యోతి): యువత పోరు పేరుతో వైసీపీ మరో దొంగాటకు తెర తీసిందని, దాన్ని ప్రజలు నమ్మరని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ విమర్శించారు. బుధవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో వైసీపీ యువపోరు పేరుతో నిర్వహించిన ధర్నా కార్యక్రమాన్ని ఆయన ఖండించారు. హుశేనాపురంలో మాజీ సీఎం జగన్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు యువత భవిష్యత్తును సర్వనాశనం చేసి పోరుబాట సాగిస్తే ప్రజలెవరూ నమ్మే స్థితిలో లేరన్నారు. ఐదేళ్లలో వైసీపీకి గుర్తుకురాని ఫీజు రీయంబర్స్‌మెంటు ఇప్పుడు గుర్తుకు వచ్చిందా? అని ప్రశ్నించారు. రూ.4.271 కోట్లు ఫీజు రీయంబర్స్‌మెంటు వసతి దీవెన బకాయిలు పెట్టింది జగన్ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. 2014-19లో చంద్రబాబు ప్రభుత్వం 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు ఇస్తే.. జగన్ ప్రభుత్వం కుదించి 9 లక్షల మందికి మాత్రమే ఇచ్చి మిగతా వారికి అన్యాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ బాషా, కేవీ మధు, రాము, జీకే సుధాకర్, కాటినేని నారాయణ, గువ్వ రవికుమార్, బజారు, జయకృష్ణ, నారాయణ, రామగోవిందు, వేణు, రజాక్ పాల్గొన్నారు.

భూ సమస్యలపై శ్రద్ధ చూపండి : కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సెక్షన్ 22ఏ1 భూములు, చుక్కల భూముల పరిష్కారంపై స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌తో కలిసి నిషేధిత జాబితాలోనుంచి చుక్కల భూముల తొలగింపుపై జిల్లాస్థాయి స్క్రూటిని కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సెక్షన్ 22ఏ1 భూములు, చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు 24 దరఖాస్తులను స్వీకరించారని, ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గత నాలుగు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ భూములను పరిశీలించి అర్హతను బట్టి నిషేధిత జాబితాలో నుంచి డీ నోటిఫై చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్, డోన్ ఆర్డీవో నరసింహులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.


అధికారితో చర్చిస్తున్న కలెక్టర్ రాజకుమారి

కాటేసిన కరెంటు తీగలు

అవుకు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నంపల్లె గ్రామంలో విద్యుదాఘాతంతో చిన్నతిమ్మిగాళ్ల వేణుగోపాల్ (36) అనే వ్యక్తి బుధవారం మృతి చెందాడు. వేణుగోపాల్ స్వగ్రామం బేతంచెర్ల మండలం బలపాలపల్లె గ్రామం. జీవనాధారం కోసం మూడు సంవత్సరాల క్రితం కుటుంబంతో అవుకు వచ్చి స్థిరపడ్డాడు. కూలి పనులకు వెళుతూ జీవనం సాగించేవాడు. ఉదయం చెన్నపల్లె గ్రామంలోని సీపీ మహేశ్వరరెడ్డి ఇంటి పైభాగంలోని సిమెంట్ స్లాబ్‌ను పగుల గొట్టేందుకు వేణుగోపాల్ కూలి పనికి వెళ్లాడు. పని చేస్తున్న క్రమంలో ఇంటిపై ఉన్న విద్యుత్ తీగలు ప్రమాదమశాత్తు తగిలి మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య ఎల్లమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.

ఆర్‌యూలో సీఐడీ విచారణకు రంగం..?

• వీసీని హెచ్చరించిన ఉన్నత విద్యామండలి



కర్నూలు అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో సీబీ సీఐడీ విచారణకు రంగం సిద్ధమవుతోందని సమాచారం. పదేళ్లుగా కొన్ని కీలక ఆర్థిక పరమైన అంశాలకు సంబంధించి ఓచర్స్, ఫర్నిచర్ మిస్సింగ్, కీలక ఫైళ్ల దొంగతనాలు, తదితర అంశాలకు సంబంధించి గతంలో విజిలెన్స్ కేసులు నమోదయ్యాయి. వీటిపైన విచారణ చేసుకోవాలని 26వ పాలక మండలిలో అనుమతులు కూడా ఇచ్చారు. కానీ ఇంత వరకు కేసులో పురోగతి లేకపోవడంతో ఈ కేసుల పైన సీఐడీ రంగంలోకి దిగుతున్నట్లు తెలిసింది. ఇందులోభాగంగానే విజయవాడ సీఐడీ వర్సిటీలోని అధికారులను హెచ్చరించినట్లు సమాచారం. వీటిపైన ఉపకులపతి డాక్టర్ వెంకట బసవరావును వివరణ కోరగా ఉన్నత విద్యామండలి జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించిన మాట వాస్తవమేనని, సీఐడీ గురించి తనకు సమాచారం లేదని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాశాఖ మంత్రికి కొందరు అధికార పార్టీ నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు పెండింగ్ కేసులపై విచారణ చేసి వర్సిటీలో ప్రశాంత వాతావరణం నెలకొల్పే దిశగా చర్యలు తీసుకోవాలని కోరిన విషయం తెలిసిందే. పెండింగ్ కేసులను వెంటనే పూర్తి చేసి వర్సిటీలో పాలనను గాడిలో పెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఫేసీ ఉన్నత విద్యామండలితో పాటు, సీబీసీఐడీకి మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఇదే అంశంపై ఓ విద్యార్థి సంఘం నాయకుడు లోకాయుక్తాను ఆశ్రయించారు. ఈ క్రమంలోనే సీబీసీఐడీ అంశం వర్సిటీలో ప్రొఫెసర్లు, విద్యార్థులు, ఉద్యోగుల మధ్య చర్చనీయాంశంగా మారింది.

బీసీ రుణాలు అర్హులకే ఇవ్వాలి


అడిషనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సమితి సభ్యులు

కర్నూలు న్యూసిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): బీసీ రుణాలు అర్హులకే ఇవ్వాలని అఖిల భారత బీసీ రిజర్వేషన్ల పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీకాంతయ్య అన్నారు. బుధ వారం నగర పాలక కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పరిధిలో 7 వేల మంది దరఖాస్తు చేసుకున్నార న్నారు. అందులో 103 మందికి మాత్రమే బీసీ రుణాలు ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. బీసీ రుణాల పంపిణీలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు జే. చంద్ర కళాబాయ్, నాయకురాలు జి. చంద్రికమ్మ పాల్గొన్నారు.

15న మండల సర్వసభ్య సమావేశం

ఓర్వకల్లు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఓర్వకల్లు లోని ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 15న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ తిప్పన్న అధ్యక్షత వహించగా.. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరవుతారన్నారు. గత సమావేశంలో చర్చించిన అంశాలు, వాటి పురోగతిపై సమీక్ష ఉం టుందన్నారు. ఆయా శాఖ అధికారులు ప్రగతి నివేదికలతో సమావేశా నికి హాజరు కావాలన్నారు.

కరాటే బెల్టు గ్రేడింగ్ టెస్టు

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): యూనివర్సల్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జేఎంజే పాఠశాలలో కరాటే బెల్టు గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ సిస్టర్ ఎలిజ బెత్ హాజరై మాట్లాడారు. చిన్నారులు చదువుతోపాటు కరాటే, ఉషూ, మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడలను నేర్చుకోవాలన్నారు. అనం తరం ఆరేంజ్ బెల్టులను సాధించిన చిన్నారులకు సర్టిఫికెట్లు, బెల్టు లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాహనాల వేలంలో రూ.5.77 లక్షలు

కర్నూలు అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వివిధ నేరాల కింద పట్టుబడిన వాహనాల వేలం ప్రక్రియలో ప్రభుత్వానికి రూ. 5,77,800 లక్షల ఆదాయం సమకూరిందని ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ తెలిపారు. బుధ వారం ఉదయం కర్నూలు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో సూపరింటెం డెంట్ సుధీర్ బాబు ఆధ్వర్యంలో 24 వాహనాలకు గాను 17 వాహనాలను వేలంలో లబ్ధిదారులు దక్కించుకున్నారు. జీఎస్టీతో కలిపి చలానాను కట్టించుకుని వాహనాలను రీలీజ్ చేశామని తెలిపారు. మిగిలిన వాహనా లకు మరోసారి వేలం నిర్వహిస్తామన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు

గూడూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తప్పవని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద హెచ్చరించారు. బుదవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది గూడూరు నగరంలోని దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల వాడకంపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ 120 ప్లస్ మైక్రాన్ కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో భాగంగా నగరంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ ఈఈ టి.శేషాద్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపా రు. నగరంలో మాధ్యాహ్నం 12 గంటల నుంచి 2 వరకు బి.క్యాంపు సెక్షన్ పరిధిలో కరెంట్ కోత ఉంటుందన్నారు. జోహరాపురం రోడ్డు, రాంప్రియనగర్, శ్రీవారి కుటీర్, హౌసింగ్ బోర్డ్ కాలనీల్లోని ప్రజలు గుర్తించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

మత్స్య కార్మికులను ఆదుకోవాలి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నవీన్‌కుమార్

కర్నూలు అగ్రిక ల్చర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఉమ్మడి జిల్లా డీఎఫ్‌సీఎస్ చైర్మన్ బీఎస్ నవీన్ కుమార్ విజయవాడలో మంత్రి అచ్చెన్నాయుడును కలిసి వినతి పత్రం అందజేశారు. మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం ఎన్నెన్నో పథకాలు అమలు చేసేందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీశైలం రిజర్వాయరులో సీడ్ స్టాకింగ్ కార్యక మాన్ని మరింత విస్తరిం చేందుకు 2 కోట్ల చేప పిల్లలను విడు దల చేసే అవకాశం ఉందని, దీనికి సహకారం అందించాలని మంత్రి అచ్చెన్నాయుడును కోరారు.

సారా జోలికి పోవద్దు

కర్నూలు అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నాటు సారా జోలికి పోవద్దని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి అన్నారు. బుధవారం కర్నూలు మండలం దిన్నెదేవరపాడులో నాటుసారా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. నాటు సారాకు దూరంగా ఉంటా మని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మా ట్లాడుతూ నాటు సారా రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం నవోదయం- 2.0 కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, సూపరింటెండెంట్ సుధీర్ బాబు, అసిస్టెంట్ సూపరింటెండెంట్లు సుధాకర్‌రెడ్డి, రాజశేఖర్ గౌడ్, సీఐ చంద్రహాస్ పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించండి

కోడుమూరు రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తమపై పనిభారం తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. బుధవారం సాయంత్రం ఎంపీ డీవో రాముడుకు ఆయా గ్రామాల పం చాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఎస్ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, వేణుగోపాల్‌లు మాటా డుతూ నిత్యం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సర్వేలతో ఇబ్బం ది పడుతున్నామన్నారు. పనిభారంతో మానసిక ఒత్తిడికి లోనై ఆసుపత్రి పాలవుతున్నారు. కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శులు అజయ్ భాస్కర్, స్వామి, మురళీధర్, నాగార్జున, రాజ్య లక్ష్మి, క్రిష్ణయ్య స్వప్నకుమారి, శంకరమ్మ, మాధవిరెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

డీపీఆర్‌లు రూపొందించండి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యులతో ఎంఎస్‌ఎంఈల ఏర్పాటుకు డీపీఆర్‌లు రూపొందించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత శాఖల అధికారులను ఆదేశిం చారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో ముఖ్యమంత్రి అధ్యక్షతన నిర్వ హించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్య లపై కలెక్టర్, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు 50 లేదా వంద మందితో క్లస్టర్‌లుగా రూపొందించి వారితో ఓర్వకల్లు ఎంఎస్ ఎంఈ పార్కులో ఎంఎస్‌ఎంఈలు ఏర్పాటు చేయించాలని ఏపీఐఐసీ జడ్‌ఎం, మెప్మా పీడీ, డీఆర్‌డీఏ పీడీ, ఇండస్ట్రీస్ జీఎంను ఆదేశించారు. తడకనపల్లి కోవా తయారీదారులు, జూట్‌బ్యాగ్ ఉత్పత్తులు చేసే వారిని ప్రోత్సహించాలని అన్నారు. ఏపీఐఐసీ ద్వారా వారికి సరిపడినంత భూ మిని కేటాయించి, షాపులు నిర్మిస్తామన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలు, దేవాలయాలు, చర్చిలు, మసీదులు, పార్కులు, బస్, రైల్వేస్టేషన్లు, వసతి గృహాలు, ఆసుపత్రులు, మార్కెట్ యార్డులు, రైతుబజార్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పారిశ్రామిక సంస్థలు తదితర ప్రాంతాల్లో ఈ నెల 3వ శనివారం పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. వ్యవ సాయ అనుబంధ శాఖల సమీక్షలో భాగంగా వచ్చే ఏడాదికి లక్ష్యంగా నిర్దేశించిన 64 వేల ఎకరాలకు ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించేలా చర్యలు తీసుకోవాల న్నారు. నెలాఖరున నిర్వహించనున్న కలెక్టర్‌ల కాన్ఫరెన్స్‌కు ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి వివరాలతో సమగ్ర నివేదికను సీపీవోకు అందజేయాలని కలెక్టర్ ఆయా శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, సీపీవో హిమప్రభాకర్ రాజు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే చదివించాలి

- పిల్లల చదువు కోసం తల్లి ఆరాటం
- ఆర్థిక ఇబ్బందులతో బడికి దూరమైన పిల్లలు
- స్పందించిన పీపీఎస్ఎస్ సభ్యులు


చిన్నారులను బడిలో చేర్పిస్తున్న పీపీఎస్ఎస్ సభ్యులు

కర్నూలు న్యూసిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వారిది నిరుపేద కుటుంబం. భర్త చిరువ్యాపారంలో నష్టపోయాడు. భార్య ఇండ్లలో పని చేస్తూ ముగ్గురు పిల్లను పోషిస్తోంది. తమ పిల్లలను ప్రభుత్వమే చది వించాలని ఆమె కోరుతోంది. కోడుమూరు నుంచి ఓ దళిత కుటుం బం నగరానికి వచ్చి పోస్టల్ కాలనీలో నివాసముంటోంది. వినయ్ రాజుకు భార్య సుజాత, పిల్లలు పూజ, తేజ, వికాస్ సంతానం. అక్కడ పనులు లేకపోవడంతో వలస వచ్చి నగరంలోని రామలింగేశ్వర్ నగర్ లో వ్యాపారం చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటున్నాడు. అయితే గత సంవత్సరం వ్యాపారంలో నష్టం వచ్చింది. దీంతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఈ క్రమంలో భార్య ఇండ్లలో పని చేస్తూ కుటుంబాన్ని నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో ఫీజులు చెల్లించలేక ముగ్గురు పిల్లలను బడి మాన్పించారు. రెండవ తరగతి చదువుతున్న పూజ తల్లి వెంట ఇండ్లలో పనికి వెళుతోంది. ఈ విషయం పట్టణ పౌర సంక్షేమ సంఘం సభ్యులు ఇరిగినేనిపుల్లారెడ్డి, బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాకోబులకు తెలిసింది. చిన్నారు లను ఓ ప్రైవేటు పాఠశాలలో చేర్పించారు. సంఘం సహకారంతో ఫీజులు చెల్లించే విధంగా పాఠశాల యజమాన్యాన్ని ఒప్పంచారు. తమ ఆర్థిక పరిస్థితి బాగాలేదని, ప్రభుత్వమే తమ పిల్లలను చదివిం చాలని చిన్నారుల తల్లి సుజాత కోరుతోంది. ఈ కార్యక్రమంలో పౌర సంక్షేమ సంఘం సభ్యులు చంద్రమౌళి, ఎన్.పీటర్, ఎస్.రమణగౌడు, మహ్మద్ యూనుస్, మద్దిలేటి, శ్రీనివాసులు తదతరులు పాల్గొన్నారు.

లక్ష్మీ మాధవస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వరుడిగా ముస్తాబైన స్వామివారు


స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చకులు

కోడుమూరు రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరం ట్లలో వెలసిన లక్ష్మీమాధవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవా రం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆలయంలో అర్చకులు స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. రాత్రి పూజా రులు హరి, పురుషోత్తం ఇంటి నుంచి మేళతాళాల మధ్య పట్టువస్త్రాలు, పూజా సామగ్రి తీసుకొచ్చారు. ఆలయంలో స్వామి అమ్మ వార్లను ముస్తాబు చేశారు. ఉత్సవమూర్తులను ఆశీనులగావించి రోలులో దంచిన వడ్లగింజలను సంప్రదాయబద్ధంగా మీదుగా పోశారు. అనం తరం పుట్ట మన్ను, కొబ్బరి, మామిడి, పూలతోరణాలతో మండపం అలం కరించారు. మాధవుడిని పెళ్లికుమారుడిగా ముస్తాబులో భాగంగా ఈ క్రతువు నిర్వ హిస్తామని పూజారులు తెలిపారు.

సిండికేట్ రాయుళ్లపై చర్యలు తీసుకోండి


ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్‌కు వినతిపత్రం ఇస్తున్న బాలక్రిష్ణయ్య

కోడుమూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మద్యం సిండికేట్ రాయుళ్లపై చర్యలు తీసుకోవాలని, కోడుమూరు పట్టణంలోని ఐదు మద్యం షాపుల్లో ఎమ్మార్పీ కంటే అధికంగా వసూళ్లు చేస్తున్నారని ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లింగం బాలకృష్ణ అన్నారు. స్థానిక ఎక్సైజ్ పోలీసుస్టేషన్ లో హెడ్‌కానిస్టేబుల్ తిరుపాల్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మద్యం సిండికేట్ రాయుళ్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ టీడీపీ కూటమి ప్రభుత్వం ఆదేశాలను పట్టించుకోకుండా ఎమ్మార్పీ కంటే క్వాటర్, ఆఫ్, ఫుల్, బీర్లపై అధిక ధరలను వసూళ్లు చేస్తున్నారని అన్నారు. ప్రతి బ్రాండ్‌పై అధిక వసూళ్లకు పాల్పడుతున్నప్పటికీ ఎక్సైజ్ పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అలాగే మద్యం షాపుల ముందు ప్రజలకు కని పించే విధంగా మద్యం ధరల పట్టికను ఏర్పాటు చేయించాలని డిమాండ్ చేశారు.

ప్రైవేటు బ్లడ్ బ్యాంకుల్లో తనిఖీలు


ప్రైవేటు బ్లడ్ బ్యాంకును తనిఖీ చేస్తున్న టీబీ ఆఫీసర్ భాస్కర్

కర్నూలు హాస్పిటల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు నగరంలోని ప్రైవేటు బ్లడ్ బ్యాంకులను బుధవారం రాత్రి జిల్లా టీబీ ఆఫీసర్ డా.ఎల్.భాస్కర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా నగరంలోని గౌరి గోపాల్ హాస్పిటల్ సమీపంలో ఉన్న అక్షయ బ్లడ్ బ్యాంకును తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆ తర్వాత రాజ్‌విహార్ వద్దనున్న కేర్ బ్లడ్ బ్యాంకును తనిఖీ చేశారు. బ్లడ్ బ్యాంకులో ఐదుగురు సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం ఒక్క ల్యాబ్ టెక్నీషియన్ మాత్రం ఉండటం పై అధికారి మండిపడ్డారు. రక్తాన్ని క్రాస్ మ్యాచింగ్ చేయడానికి డాక్టర్ ఉండాలని, ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. డాక్టర్ లేకుండా స్టాఫ్ నర్సు లేకుండా, సిబ్బంది లేకుండా బ్లడ్ బ్యాంకు నిర్వహణ ఎలా చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడా రికార్డులు లేవని, 45 యూనిట్ల రక్తం ఉన్నా వివరాలు ఎక్కడా కనిపించడం లేదని మండిపడ్డారు. కేర్ బ్లడ్ బ్యాంకుపై ఏపీ శాక్స్‌కు, కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని చెప్పారు. అనంతరం నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లోని విశ్వభారతి బ్లడ్ బ్యాంకు, న్యూలైఫ్ బ్లడ్ బ్యాంకును తనిఖీ చేశారు.

వైసీపీ ఆవిర్భావ దినోత్సవం


వేడుకల్లో పాల్గొన్న వైసీపీ నాయకులు

కోడుమూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కోడుమూరు పట్టణంలో వైసీపీ ఆవిర్భావ దినోత్సవం బుధవారం నిర్వహించారు. వైసీపీ మండల కన్వీ నర్ రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో స్థానిక హేమాద్రిరెడ్డి కాంప్లెక్స్ లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లా డుతూ వైఎస్‌ఆర్ ఆశయ సాధన కోసం కార్యకర్తలు కృషి చేయాల న్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం సిక్స్ పథకాలను అమలు చేయ కుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ లింగన్న, వైసీపీ నాయకులు రవికుమార్‌రెడ్డి, లింగమూర్తి, ధరణిరెడ్డి, పాలాక్షిరెడ్డి పాల్గొన్నారు.

ధూమపానంతో ఆరోగ్యానికి ముప్పు


పోస్టర్లు విడుదల చేస్తున్న డాక్టర్ రఘు

కోడుమూరు రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ధూమపానంతో ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని సంచార చికిత్స జిల్లా నోడల్ అధికారి, డాక్టర్ రఘు హెచ్చరించారు. మండలంలోని వర్కూరులో బుధవారం సంచార చికిత్సను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధూమ పానం వలన కలిగే అనర్థాలను వివరిస్తూ పోస్టర్లను విడుదల చేశారు. ఏటా మార్చి రెండో బుధవారం జాతీయ ధూమపాన నిషేధ దినం పాటిస్తున్నట్లు తెలిపారు. పొగతాగడం వలన ఊపిరితిత్తుల క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో నరసప్ప, సూప ర్‌వైజర్ కమాల్‌సాహెబ్ పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి రూ.45 లక్షలు మంజూరు

ఓర్వకల్లు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయ ప్రహరీ నిర్మాణానికి రూ.45లక్షలు మంజూరైనట్లు ఈవో మద్దిలేటి బుధ వారం తెలిపారు. రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్, సహాయ సహకారాలతో నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానా యుడు నిధులు మంజూరు చేశారని తెలి పారు. ఈ సందర్భంగా వారికి ఈవోతోపాటు ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

బాలల కోసం హెల్ప్‌లైన్లు

జిల్లా బాలల సంరక్షణ అధికారి టి.శారద


మాట్లాడుతున్న శారద

కర్నూలు కల్చరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): బాలల కోసం హెల్ప్‌లైన్లు అందుబాటులో ఉన్నాయని జిల్లా బాలల సంరక్షణ అధికారి టి.శారద అన్నారు. బుధవారం నగరంలోని అబ్దుల్లాఖాన్ ఎస్టేట్‌లోని విజన్ కళాశాలలో రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత ఆధ్వర్యంలో బాలల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. విజన్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జలీల్ సాహెబ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టి.శారద మాట్లాడుతూ బాలల సహాయం కోసం చైల్డ్ లైన్ 1098, హెల్ప్‌లైన్ 181కు కాల్ చేయవచ్చని సూచిం చారు. జలీల్ సాహెబ్ మాట్లాడుతూ ఆకతాయిలను కట్టడి చేసేందుకు పోలీసు అధికారులు 36 బీట్లలో ప్రత్యేక బృందాలు తిరుగుతున్నా యన్నారు. ద్విచక్ర వాహనాలను మైనర్లు నడపరాదని, తల్లిదండ్రులు కూడా లైసెన్సు లేని పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా బహిరంగ మద్యపానం, గం జాయి, మాదకద్రవ్యాల వినియోగం, పబ్లిక్ న్యూసెన్స్ వంటివి జరిగితే డయల్ 100, డయల్ 112 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎండీ సుబాయ్ ఆలమ్, అధ్యాపకులు హైమ మతి, సరస్వతి, ఐశ్వర్యరాణి, రాజ్యలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

కాశిరెడ్డి నాయన ఆశ్రమం కూల్చివేత దురదృష్టకరం

అసెంబ్లీలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత


మాట్లాడుతున్న గౌరు చరిత

కల్లూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): బద్వేలు నియోజకవర్గంలో అవధూత కాశిరెడ్డి నాయన ఆశ్రమం కూల్చివేత ఘటన దురదృష్టకర మని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. బుధవారం అసెంబ్లీలో ఈ అంశంపై చర్చించి అక్కడ ఆశ్రమాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కాశిరెడ్డి నాయన పేరుతో రాయలసీమలో ఎన్నో ఆశ్రమాలు ఉన్నాయని, వేలాది మంది భక్తులకు అక్కడ అన్నదానం నిత్యం జరు గుతుందన్నారు. సదరు సత్రం అటవీ భూమిలో ఉందని సత్రాన్ని కూల్చి వేశారన్నారు.

మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలి


మాట్లాడుతున్న విజయభాస్కర్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలని మెప్మా సీఎంఎం విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. శ్రీరామ్‌నగర్‌లో సిరి, శ్రీదత్త ఐక్య మహిళా పరస్పర సహాయం సహకార పొదుపు 2023-2024 వార్షిక మహాసభ బుధ టవారం జరిగింది. ముఖ్య అతిథిగా భాస్కర్‌రెడ్డి హాజరై మా ట్లాడుతూ మహిళల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పా టు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సీఓ పుష్పావతి, ఆర్‌పీలు ఎస్.ఉమాదేవి, సి.మంజుల, సిరి ఐక్య సంఘం అధ్యక్షురాలు వి.రా. దిక, కార్యదర్శి బి.హైమావతి పాల్గొన్నారు.

ఘనంగా ఐద్వా ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు

కర్నూలు న్యూసిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నగరంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 44వ ఆవిర్భావ దినో త్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం ఇందిరాగాంధీ నగర్, ముజఫర్ నగర్, చైతన్యనగర్, వీకర్‌సెక్షన్ కాలనీల్లో ఐద్వా జెండాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకురాలు పి.నిర్మ ల మాట్లాడుతూ ఐద్వా 1981 మార్చి 12న ఏర్పడిందన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, వరకట్నపు వేధింపులు, మూఢ నమ్మకాలు, దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపుని చ్చారు. కార్యక్రమంలో ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు కె.అరుణ, ఎన్.అలి వేలు, ఎం.కుమారి, శంకరమ్మ, ఎస్.శ్యామల, జే.లక్ష్మీబాయి పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి

ఓర్వకల్లు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీవో శ్రీనివాసులు కోరారు. బుధవారం మండలంలోని మీదివేముల గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించి మస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు నాణ్యతగా చేపట్టాలన్నారు. ఎండతీవ్రత ఎక్కు వగా ఉందని కూలీలు తగు జాగ్రత్తలు తీసుకో వాలన్నారు. ఆయన వెంట ఏపీవో కుమారసాయినాథ్ ఉన్నారు.

గ్లకోమాను ప్రాథమిక దశలో గుర్తించాలి: డీఎంహెచ్‌వో



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

కర్నూలు హాస్పిటల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గ్లకోమా వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నయం చేసే అవకాశం ఉందని డీఎంహెచ్ వో డా.పి.శాంతికళ అన్నారు. వరల్డ్ గ్లకోమా డే ను పురస్కరిం చుకుని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని కర్నూలు ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో డీఎంహెచ్‌వో ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఒకప్పుడు గ్లకోమాను గుర్తించిన నివారించలేని పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం ఆధునిక వైద్య విధానాలు అందుబాటులో వచ్చాయని అన్నారు. కంటి లోపల నీటి ప్రవాహాన్ని సాధారణ స్థితికి తీసుకువచ్చే చికిత్స అందుబాటులో ఉందన్నారు. ఐ-హాస్పిటల్ సూపరిం టెండెంట్ డా.పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సాధారణంగా 40 ఏళ్లు పై బడిన వారికి వచ్చే ఈ వ్యాధి విపరీతమైన ఒత్తిడి కారణంగా తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. గ్లకోమా లేని సమాజం కోసం పాటు పడదాం అంటూ పిలుపునిచ్చారు. అనంతరం ఈ ర్యాలీ ప్రాంతీయ కం టి ఆసుపత్రి నుంచి కర్నూలు జీజీహెచ్ వరకు కొనసాగింది. కార్యక్ర మంలో ఐ-హాస్పిటల్ ప్రొఫెసర్ డా.సత్యనారాయణ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.హరిహరప్రసాద్, డా.శివప్రియ, ఆర్ ఎంవో డా.జి.భరత్, వైద్యాధికారులు, అప్టోమెట్రిస్‌టలు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ కార్యదర్శి డా.ఎం.సంధ్యా రెడ్డి పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక ఎ.క్యాంపు షైఫర్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు బుధవారం గ్లకోమాపై ప్రజలకు అవగాహన కల్పించారు. మోడ్రన్ ఐ హాస్పిటల్ డాక్టర్ జి.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జోహరా పురం కిమ్స్ ఆసుపత్రి నుంచి ఏబీఎం చర్చి వరకు ఫార్మసీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. డయాగ్నసిస్ ఎలా చేయాలి, ట్రీట్మెం ట్ ఎలా తీసుకోవాలి అనే అంశాల పై ప్రజలకు అవగాహన కల్పిం చారు. ప్రిన్సిపాల్ కె.మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ కాసర్ల సురేష్, అధ్యాప కులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అడుగు జాడల్లో నడవాలి


మాట్లాడుతున్న ఆర్డీవో

మద్దికెర, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): యువకులు బీఆర్ అంబేడ్కర్ అడుగు జాడల్లో నడవాలని పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్ సూచించారు. బుధవారం స్థానిక మెయిన్‌బజారులో డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఆర్డీవో మాట్లాడు తూ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు యువత ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. మంచి చదువులు చదివి ప్రయోజకులు కావాలని, ఆశయ సాధనకు ముందుకు సాగాలన్నారు. సర్పంచ్ బండారు సుహాసిని, కార్యదర్శి శివకుమార్, గ్రామస్థులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సోలార్‌ను ఏర్పాటు చేయాలి

విద్యుత్ మంత్రికి విన్నవించిన వీరభద్ర గౌడ్


మంత్రికి సమస్యలు వివరిస్తున్న వీరభద్ర గౌడ్

ఆలూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫారాలకు సోలార్ ప్యానెళ్లను అమర్చాలని రాష్ట్ర విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ కోరారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో మంత్రిని కలసి విన్నవించారు. సోలార్ ప్యానెల్లు ఏర్పాటు చేస్తే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా ఇబ్బంది ఉండన్నారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని వీరభద్ర గౌడ్ తెలిపారు.

నాయకుల నిర్ణయం మేరకు నియామకాలు


ఆస్పరిలో మాట్లాడుతున్న వెంకప్ప

ఆస్పరి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కూటమి నాయకుల నిర్ణయాల మేరకు నియామకాలు చేయాలని ఆలూరు జనసేన ఇన్‌చార్జి వెంకప్ప అన్నారు మంగళవారం మాట్లాడుతూ గాడి తప్పిన రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ గాడిన పెట్టారన్నారు. ఉపాధి హామీ, మధ్యాహ్న భోజనం పథకంలో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని కోరారు. ఉదయ్ కుమార్, అరవింద్ యాదవ్, శ్రీనివాసులు, రాఘవేంద్ర, జగన్నాథ్, ఉరుకుంద, ఉగాది, అంజి, గురుస్వామి పాల్గొన్నారు.

గోకులం షెడ్లతో రైతుల అభివృద్ధి


గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

తుగ్గలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్లతో రైతులు అభివృద్ధి చెందుతారని టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ వెంకట స్వామి అన్నారు. బుధవారం లక్ష్మీతండా, జాప్లా తాండాలో గోకులం షెడ్లను ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం రైతులు, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఆరు నెలల్లోనే మండలానికి 72 గోకులం షెడ్లు వచ్చాయని, రూ.2.35 లక్షల నిధులు మంజూరవుతాయన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు నీటి కాలువలు కూడా నిర్మించారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి మరిచి వారి జేబులు నింపుకోవడానికి పని చేశారని ఆరోపించారు. రామూ నాయక్, తిరుపాల్ నాయక్, జయరాం నాయక్, శ్రీను నాయక్, తేజా నాయక్, టోకే నాయక్ తదితరులు ఉన్నారు.

సారాను నిర్మూలిద్దాం

ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు


అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్

వెల్దుర్తి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సారాను నిర్మూలించాలని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పుల్లగుమ్మి, వెల్దుర్తి గ్రామాల్లో నవోదయం నిర్వహించారు. సారా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. సారా తయారీ మానివేసేవారికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పిస్తోందన్నారు. ఎస్టీఎఫ్ ఏసీ సుధాకర్‌రెడ్డి, ఈఎస్ సుధీర్‌బాబు, సీఐ మంజుల, ఎమ్మార్వో చంద్రశేఖర్‌వర్మ, ఎంపీడీవో సుహాసినమ్మ, ఎస్ఐ చంద్రమోహన్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం


ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న కార్యకర్తలు

ఆలూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. బుధవారం పట్టణంలో వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. దిగవం తగ సీఎం వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి కేక్‌కట్ చేసి సంబ రాలు జరుపుకున్నారు. వైసీపీ ప్రజల పక్షాన నిలిచిందని, ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత వైసీపీకే దక్కిందన్నారు. దిగవంత సీఎం వైఎస్సార్ ఆశయ సాధనకు, జగన్ కృషి చేస్తున్నారన్నారు. కన్వీనర్లు మల్లికార్జున, షఫీవుల్లా శేషప్ప, గిరి, భాస్కర్, వీరేష్, వరుణ్, రాజశేఖర్, రాజు, అరికెర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

15న బహిరంగ చర్చా వేదిక

తుగ్గలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): 2023-24 ఉపాధి పనుల సామాజిక తనిఖీలపై ఈ నెల 15న చర్చావేదిక నిర్వహిస్తున్నామనీ ఏపీవో హేమసుందర్ తెలిపారు. బుధవారంకార్యాలయంలో మాట్లాడుతూ బృందాలు చేసిన తనఖీపై చర్చిస్తామని, ఉపాధి సిబ్బంది, ప్రజలు హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు.

బాదుడు..!

క్వింటానికి నాలుగు కేజీలు అదనంగా తీసుకుంటున్న వ్యాపారులు

కొనుగోలు చేస్తామని మాట మార్చిన అధికారులు

అవస్థలు పడుతున్న కంది రైతులు


చెన్నంపల్లి గ్రామంలో నిల్వ ఉంచిన కందులు

తుగ్గలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో దాదాపు 25వేల ఎకరాలకు పైగా కంది సాగు చేశారు. పంట పూర్తయి దిగుబడి కూడా వచ్చింది. తీరా అమ్ముకుందామంటే గిట్టుబాటు ధర ఇస్తామన్న ప్రభుత్వం ఆమాటే మరిచింది

మాట తప్పిన అధికారులు

కందులను రూ.7,550ల ప్రకారం గిట్టుబాటు ధర చెల్లించి కొనుగోలు చేస్తా మని అధికారులు చెప్పడంతో రైతులు ఆనందించారు. కందుల కొనుగోళ్లకు రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. అయితే ఏమైందో కాని నెలలు గడిచినా ఆ మాటే మరిచారు. దీంతో కందులను నిలువ చేసుకోలేక రైతులు అవస్థలు పడుతున్నారు. పురుగు పడుతుందునని ఆందోళన చెందుతున్నారు.

వ్యాపారుల దోపిడీ..

కందులను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ఇదే అదనుగా భావించిన వ్యాపారులు దోపిడీకి తెరతీశారు. బాదు పేరుతో క్వింటానికి అదనంగా 4 కేజీల వరకు తీసుకుంటున్నారు. దీంతో రైతులు లబోదిబో మంటున్నారు. ఇలా అయితే తమకు గిట్టుబాటు కాదంటున్నారు.

● ఈ విషమమై ఏవో పవన్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనకు అనుగుణంగా కందులను కొనుగోలు చేయాలి. ఉన్నతాధికారుల అనుమతి రాగానే కందులను కొంటాం.

పురుగులు పడుతున్నాయి



రెండెకరాల్లో కంది సాగు చేశా. 6క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇళ్లలో నిల్వ చేసుకోవడం వల్ల పురుగులు పడుతున్నాయి. గత్యంతరం లేక ప్రైవేటు వ్యక్తులకే అమ్ముతున్నాము. - **రవీంద్రనాయక్, రైతు, సూర్యతండా**

ప్రభుత్వం కొనుగోలు చేయాలి



మూడెకరాల్లో కంది సాగు చేశా. పది క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పి రెండు నెలలు గడిచినా పట్టిం చుకోలేదు. ఇకనైనా కొనుగోలు చేయాలి. - **మల్లికార్జున, రైతు, రామలింగాయపల్లె**

వైసీపీ వర్గీయుల ఘర్షణ

వెల్దుర్తి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బింగిదొడ్డి గ్రామంలో వైసీపీకి చెందిన ఇరు వర్గాలు ఘర్షణ పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. శంకర్‌రెడ్డి వర్గం, జగన్‌మోహన్‌రెడ్డి వర్గాల మధ్య ఆధిపత్య పోరు ఎప్పటినుంచో ఉన్నట్లు సమాచారం. బుధవారం ఇరు వర్గాలవారు దాడులు చేసుకోవడంతో కొందరు వ్యక్తులు గాయపడ్డారు. పరస్పరం పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు.

మోడల్ కళాశాలల్లో ఇంటర్ ప్రవేశాలు

ఆలూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ మోడల్ కళాశాలల్లో ఇంటర్ 2025-26 మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాఘవరావు బుధవారం తెలిపారు. మే 22 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంగ్లీష్ మీడియం ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఐసీ కోర్సులు ఉన్నాయన్నారు. ఓసీ, బీసీ, ఈ డబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200లు, ఎస్సీ, ఎస్టీలు రూ.150లు చెల్లించాల న్నారు. మెరిట్, రిజర్వేషన్ ప్రకారం ఎంపిక ఉంటుందన్నారు.

వైద్యశాలకు స్థలం ఎక్కడో..!

మొన్న జేసీ, నేడు ఆర్డీవో.. రోజుకో చోట పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్

దేవనకొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పీహెచ్‌సీ నిర్మాణం రోజుకో మలుపు తిరుగుతోంది. ఇప్పటికే పలుమార్లు స్థల పరిశీలన చేయగా, బుధవారం పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్, తహసీల్దార్ ప్రసాద్‌రాజు మరోసారి పరిశీలించారు. గ్రామానికి చెందిన మొగతాల్ సునీల్‌కుమార్ సర్వే నెం.36-1లో తన సొంత భూమిలో ఎకరా స్థలాన్ని తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విరాళం ఇస్తున్నట్లు కర్నూలులో జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జేసీ ఆదేశాల మేరకు బుధవారం ఆర్డీవో, తహసీల్దార్ తెర్నేకల్‌కు వెళ్లి స్థలాన్ని పరిశీలించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వైద్యశాలను నిర్మిస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు. గత ప్రభుత్వం 46-1 లో 1.5 ఎకరాల్లో అనుమతి ఇచ్చింది. అయితే ప్రజలకు అందుబాటులో లేదని, జడ్పీ పాఠశాల వద్ద సర్వే నెం. 313 లో 1.10 ఎకరాల్లో నిర్మిస్తే అణువుగా ఉంటుందన్నారు. మళ్లీ ఇప్పుడు 36-1లో ఎకరా స్థలాన్ని దాత విరాళం ఇస్తామనడంతో మరోసారి ఏ మలుపు తిరుగుతుందోనని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం


సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమరావతి నగర్‌లో సమస్యల పరిష్కారం పట్ల మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి పీఎస్ గోపాల్ తిక్కప్ప, కృష్ణమూర్తి, వెంకటేష్ ఆరోపించారు. బుధవారం సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా కాలనీలో పర్యటించి కాలనీవాసుల సమస్యలను తెసుకున్నారు. కాలనీలో డ్రైనేజీలు, రోడ్లు సక్రమంగా లేవన్నారు. చుట్టూ ముళ్లకంప పెరగడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. వాటర్ ట్యాంకుకు మరమ్మత్తలు చేయించాలని, మున్సిపల్ అధికారులు కాలనీలో పర్యటించి, సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి

ఆదోని అగ్రికల్చర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కరోనాలో ఆపేసిన రాయచూర్ ప్యాసింజర్‌తో, మిగతా వాటిని పునర్ధురించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ వద్ద నిరసన తెలిపారు. విజయవాడకు వెళ్లే రైళ్ల నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని అమరావతికి రైళ్లను తిరిగి ప్రారంభించలేదన్నారు. బెలగావి-మణుగూరు, రాయచూరు సికింద్రాబాద్, గుంతకల్లు వయా ఆదోని మీదుగా పొడిగించాలన్నారు. అనంతరం స్టేషన్ మాస్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు వెంకన్న, భీమేష్, హుసేనీ, శిక్షావల్లి, గంగన్న, చిట్టిబాబు, గిరి మల్లప్ప, అంజి, రాము పాల్గొన్నారు

మహిళలను దగా చేసిన చంద్రబాబు

ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు షేకున్ బీ


జెండా ఆవిష్కరిస్తున్న ఐద్వా సభ్యురాలు షేకున్ బీ

ఆలూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలను దగా చేశారని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు షేకన్ బీ ఆరోపించారు. బుధవారం ఉరకుంద ఈరన్న కొట్టాల జ్యోతిబసు భవన్ వద్ద ఆవిర్భావ దినోత్సవం నిరరించారు. కార్యదర్శి కామ్రేడ్ రత్నమ్మ ఆధ్వర్యంలో ఐద్వా జెండాను ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. మహిళల కోసం అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తామని చెప్పుకుంటున్నా అమలుకు నోచుకోవడం లేదన్నారు. గౌసియా బీ, నాగమణి, రాధమ్మ, భారతి, విజయలక్ష్మి, రంగమ్మ, సీపీఎం నాయకులు నారాయణ స్వామి పాల్గొన్నారు.

గద్దెరాళ్ల రోడ్డుకు మరమ్మతులు


పనులను ప్రారంభిస్తున్న బొజ్జమ్మ

దేవనకొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-బళ్లారి రహదారిలోని గద్దెరాళ్లకు మట్టి రోడ్డు మరమ్మతులను వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ ప్రారంభించారు. గుంతలను పూడ్చివేసి, రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లకంప తొలగించారు. టీడీపీ కన్వీనర్ విజయ్‌భాస్కర్, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు, రామారావునాయుడు, మల్లయ్య, మల్లికార్జునగౌడ్, గిడ్డయ్యగౌడ్, ఉచ్చీరప్ప, రాజశేఖర్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి


నాగరత్నమ్మ(ఫైల్)

వెల్దుర్తి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎస్.బోయనపల్లికి చెందిన మాజీ సర్పంచ్ నాగరత్నమ్మ బుధవారం మృతిచెందారు. వివరాల మేరకు.. ఎంపీటీసీగా, రెండు పర్యాయాలు బోయనపల్లి సర్పంచుగా సేవలందించారు. గ్రామ నాయకుడు నర్సింగ్ కాంతారెడ్డికి ఆమె తల్లి. మాజీ ఎమ్మెల్యేలు కోట్ల సుజాతమ్మ, కాటసాని రాంభూపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ నాయకుడు సుబ్బరాయుడు, మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్, కన్వీనర్ బలరాంగౌడ్, రమాకాంత్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, మాజీ జడ్పీటీసీ సమీర్‌కుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డి పార్థివ దేహానికి నివాళి అర్పించారు.

వాల్మీకులను ఎస్టీలో చేర్చాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే పార్థసారథి



ఆదోని, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 50లక్షల మంది వాల్మీకులను ఎస్టీలో చేర్చాలని ఎమ్మెల్యే పార్థసారధి పేర్కొన్నారు. బుధవారం అసెంబ్లీలో మాట్లాడుతూ ఉత్తర భారతదేశంలో ఎస్సీలుగా, కర్నాటకలో ఎస్టీలుగా ఉన్నారన న్నారు. 1956 వరకు కూడా ఎస్టీలుగా ఉన్న వాల్మీకులను 1956లో బీసీలుగా మార్చారన్నారు. రాష్ట్రంలో కూడా ప్రాంతీయ విబేధాలు ఉన్నాయన్నారు. ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల్లో వాల్మీకులంతా ఎస్టీలుగా ఉన్నారని, విజయవాడ, నుంచి రాయలసీమ వరకు ఆత్రమే బీసీలుగా పరిగణించబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 60 ఏళ్లుగా పోరాటం చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. 2017లో సీఎం చంద్రబాబు నాయకత్వంలో అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని ముగించారు.

పనులు ప్రారంభం

క్రిష్ణగిరి, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : హంద్రీ నీవా ప్రదాన కాల్వ వెడల్పు పనులను బుధవారం ప్రారంభించారు. వెల్దుర్తి మండలం మల్లెపల్లె 3వ పంప్ హౌస్-క్రిష్ణగిరి 4వ పంప్ హౌస్ మధ్యలో ముళ్ళ కంపలను తొలగించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

చిప్పగిరి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దౌల్తాపురం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ రాధాకృష్ణపై ఏపీడీ పద్మావతి బుధవారం విచారణ చేశారు. ఉపాధి హామీ పీడీ ఆదేశాల మేరకు ఆలూరు ఏపీడీ పద్మావతి దౌల్తాపురం సచివాలయంలో కూలీలతో విచారణ చేశారు. విచారణ సమయంలో ఫిర్యాదుదారులు, ఫీల్డ్ అసిస్టెంట్ వర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఘర్షణలకు దిగితే చర్యలు తీసుకుంటామని ఎస్సై సతీష్‌కుమార్ హెచ్చరించారు.

ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయండి


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పత్తికొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకదిన్నె గ్రామ సమీపంలో శుక్రవారం చేయనున్న టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ పనుల ప్రారంబోత్సవాన్ని విజయవంతంచేయలని టీడీపీ కన్వీనర్ కడవలసుధాకర్, టీఎన్‌టీయూసీ తాలూకా అధ్యక్షుడు ముని నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్యాం బాబు ఆధ్వర్యంలో జరగనున్న ప్రారంభోత్సవంలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారని, రైతులు తరలి రావాలని కోరారు.

రేషన్ బియ్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

ఆదోని , మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరా నగర్ కాలనీలో మంగళవారం అర్ధరాత్రి 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వీఆర్‌వో సురేష్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి సమాచారం ఇవ్వడంతో ఎస్సై రామనాథ్‌తో పాటు సిబ్బంది ఇందిరానగర్‌లోని మంగళ ఆంజనేయ స్వామి గుడి వద్ద నరేష్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా ఉంచిన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని మండల స్టాక్ పాయింట్‌కు తరలిస్తున్నట్లు ఆర్ఐ కాశీం తెలిపారు. ఈ విషయంపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీజేపీ హయాంలోనే విద్యాభివృద్ధి


పనులను పరిశీలిస్తున్న నాయకులు

ఆదోని టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ హయాంలోనే విద్యాభివృద్ధికి అవకాశముందని యువమోర్చ ప్రధాన కర్యాదర్శి అంజయ్ కుమార్ అన్నారు. బుధవారం కస్తూర్బా విద్యాలయంలో అభివృద్ధి పనుల ను పరిశీలించారు. ఎమ్మెల్యే పార్థసారథి చొరవతో రూ.1.27కోట్ల అభివృద్ధి పనులు మంజూరయ్యాయని తెలిపారు. పెద్ద తుంబలం నాయకుడు బెస్త నాగ రాజు మాట్లాడుతూ, గత ప్రభుత్వం విద్యా సంస్థల అభివృద్ధి కోసం రూపాయి కూడా కేటాయించలేదన్నారు. బోయ శివ, ఈశ్వర, నరసింహులు, వినోద్ కుమార్, నరసింహులు, రాజు, ఈరన్న, ఉదయ్ పాల్గొన్నారు.

వర్గీకరణతో అన్యాయం


మాట్లాడుతున్న భీమ్ సాయిరాం

ఆదోని అగ్రికల్చర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతో దళితులకు అన్యాయం జరుగుతుందని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జై భీమ్ సాయిరాం ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం న్యాయవాది చంద్రయ్య కార్యాలయంలో మాట్లాడుతూ రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ వర్గీకరణ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 20 శాతం ఉన్న మాలలకు కేవలం 7.5 శాతం రిజర్వేషన్‌ను కేటాయించారన్నారు. మాదిగలకు 6.5 శాతం రిజర్వేషన్ కల్పించి పెద్దపీట వేయడం భావ్యం కాదన్నారు. మూడు శాతం ఉన్న రెల్లి సామాజిక వర్గానికి ఒక శాతం మాత్రమే నివేదిక కేటాయించి అన్యాయం చేశారని ఆరోపించారు. రిజర్వేషన్ల వల్ల దళితుల్లో మెజార్టీ ప్రజలకు అన్యాయం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. నాయకులు ఎల్లప్ప, నీలకంఠ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫారం వద్ద మంటలు


ట్రాన్స్‌ఫారం వద్ద చెలరేగుతున్న మంటలు

ఆలూరు , మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అరికెర రోడ్డులోని అగ్రి ల్యాబ్ సమీపంలో బుధవారం విద్యుత్ ట్రాన్స్‌ఫారం వద్ద మంటలు చెలరేగాయి. చెత్త, ప్లాస్టిక్ అంటుకోవడంతో మంటలు వ్యాపించినట్లు సమాచారం. అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆలూరు ఎస్బీఐ మేనేజర్ ప్రసాద్ బాబు



ఆలూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఖాతాదారులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆలూరు బ్రాంచి మేనేజర్ ప్రసాద్ బాబు సూచించారు.

ప్రశ్న: సైబర్ మోసాల పట్ల ఖాతదారులకు మీ సలహా?

జవాబు: అపరిచితుల మాటలతో మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలి. బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం మీ ఖాతా నెంబరు, ఓటీపీ నెంబర్ చెప్పండి అని ఫోన్ చేస్తే వాటిని చెప్పకూడదు.

ప్రశ్న: ఖాతాదారులకు బీమా ఉందా ?

జవాబు: ఎస్‌బీఐలో ఖాతా ఉన్న వారందరికీ బీమా ఉంది. ఏడాదికి రూ.200 చెల్లిసే రూ.5లక్షలు, రూ.500 చెల్లిస్తే రూ.10 లక్షలు, రూ.వెయ్యి చెల్లిస్తే రూ.20లక్షలు, రూ.2వేలు చెల్లిస్తే రూ.40లక్షల చొప్పున ప్రమాద బీమా వస్తుంది.

ప్రశ్న: బంగారు ఆభరణాలపై రుణాలు ఇస్తున్నారా?

జవాబు: 9 శాతం వడ్డీతో బంగారు రుణాలు అందిస్తాం.

జవాబు: బీసీ కార్పొరేషన్ రుణాల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

జవాబు: బీసీ కార్పొరేషన్ రుణాల కోసం 200 దరఖాస్తులు వచ్చాయి. ఎ పరిశీలించి అర్హులైన వారికి రుణాలు అందజేస్తాం.

ప్రశ్న: ఏటీఎం సేవలు ఎలా ఉన్నాయి?

జవాబు: ఆలూరు పట్టణంలో రెండు ఏటీఎం సెంటర్లు ఉన్నాయి.

కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

గోనెగండ్ల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పాలనలో అభివృద్ధి పరుగు పెడుతోందని కర్నూలు పార్లమెంట్ ఆవిర్భావ సభ సమన్వయ కర్త చింతా సురేష్ బాబు, ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రేఖగౌడ్ అన్నారు. బుధవారం గోనెగండ్లలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం పిఠాపురం చిత్రాడ గ్రామంలో జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మీడియా ఇన్‌చార్జి గానిగ బాషా, ఖాసీంసాహెబ్, మునిస్వామి, దూద్‌పీరా పాల్గొన్నారు.

వైభవంగా ధీరేంద్ర తీర్థుల మధ్యారాధన మహోత్సవాలు

మంత్రాలయం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి పూర్వపు పీఠాధిపతి ధీరేంద్ర తీర్థుల మధ్యారాధన మహోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. కర్ణాటకలోని హవేరి జిల్లా హొసరిత్తిలో వెలసిన ధీరేంద్ర తీర్థుల బృందావనానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి హస్తోదకం చేసి పీఠాధిపతి మహామంగళహారతి ఇచ్చారు. అక్కడే సంస్థాన పూజలో భాగంగా మూలరాములకు విశేషంగా బంగారు ఆభరణాలతో అభిషేకం చేశారు. ఈపూజలను కన్నులారా తిలకించిన భక్తులు మంత్రముగ్ధులయ్యారు. కార్యక్రమంలో ద్వారపాలక అనంతస్వామి, ప్రకాష్‌ఆచార్, పవన్ ఆచర్, విజయేంద్రాచార్, ఆనందతీర్థ ఆచర్, గౌతమ్ ఆచార్, గోపాలకృష్ణ స్వామి, వరదేంద్రాచార్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్షా సామగ్రి


పరీక్షా సామగ్రితో విద్యార్థులు, ప్రిన్సిపాల్

మంత్రాలయం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకల డోణ కస్తూర్బా పాఠశాలలోని 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నందవరం మండలం కనకవీడు గ్రామానికి చెందిన కిషోర్ కుమార్ ఆచార్ ఉచితంగా ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. బుధవారం తన సొంత డబ్బుతో 10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ప్రిన్సిపాల్ శాంతి ఆధ్వర్యంలో అందజేశారు. ఉపాధ్యాయులు రామకృష్ణవేణి, భ్రమరాంబ, అనసూయ, సునీత, వినోద్ పాల్గొన్నారు.

నందవరం: నందవరంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతూ స్థానిక ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవతరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని అందుకు విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో- 2 రఘునాథ్, హాస్టల్ వార్డెన్ క్రాంతికుమార్, సీఆర్‌పీ ఉరుకుంద, ట్యూటర్ నాగరాజు, విశ్వనాథ్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి


సరస్వతి దేవికి పూజలు చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కోసిగి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కోసిగి బాలుర హైస్కూల్‌లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులు ఖలీల్ అహ్మద్ తెలిపారు. బుధవారం బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు సరస్వతీ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఖలీల్ అహ్మద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మవ్వ దేవర

ఎమ్మిగనూరు రూరల్, మార్చి12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బనవాసి గ్రామంలో వెలసిన మారెమ్మవ్వ దేవర బుధవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారు జాము నుంచే అమ్మవారికి భక్తులు, అర్చకులు జలాభిషేకం, కుంకుమార్చన, పుష్పాభిషేకం, మహామంగళహారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం గ్రామంలోని మహిళలు కుంభాలతో నైవేద్యాన్ని తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రూరల్ పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

నేటి నుంచి బడేసాబ్ తాత ఉరుసు

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కమిటీ రోడ్డులో వెలసిన గంజెళ్ల బడేసాబ్ దర్గా ఉరుసు గురువారం నుంచి నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు ప్రమోద్ వంశీ సాగర్, గౌరవ అధ్యక్షుడు ఇస్సాక్ మాట్లాడుతూ 13న గంజెళ్ల బడేసాబ్ తాత ఉరుసు, 14న జియారత్ గంధం, 15 భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని జడేసాబ్ కృపకు పాత్రులు కావాలన్నారు. భక్తులకు అన్నదా నం చేస్తామని తెలిపారు.

జలకాలాటలలో..

వేసవి వచ్చిందంటే చాలు విద్యార్థులకు ముందుగా గుర్తుకు వచ్చేది ఈత. ఎండ ఎంత తీవ్రంగా ఉన్నా.. తల్లిదండ్రులు ఎంత చెప్పినా వినకుండా చల్లగా ఈత కొట్టేందుకు కాలువలు, బావుల వెంబడి పరుగెడుతారు. బుధవారం పెద్దకడుబూరు మండలంలోని కాలువలో విద్యార్థులు ఒంటిపూట బడి వదిలిన సమయంలో కాలువలో ఈత కొడుతూ సరదాగా గడిపారు.

- పెద్దకడుబూరు


పెద్దకడుబూరులోని కాలువలో ఈత కొడుతున్న చిన్నారులు

సాగు నీరందించి న్యాయం చేస్తాం

● మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి
● పైపులైన్ పనుల పరిశీలన

కోసిగి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కోసిగి మండలంలో ప్రతి రైతుకు సాగు నీరు అందించేందుకు కృషి చేస్తానని టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. బుధవారం కోసిగిలోని ఆదోని రోడ్డు వైపున ఉన్న కోసిగి రైతుల పంట పొలాలను ఆయన పరిశీలించారు. కోసిగిలోని పులి కనుమ ప్రాజెక్టు ద్వారా సుమారు 2వేల ఎకరాలకు 5 కిలోమీటర్ల మేర రూ.7 కోట్లతో పైపులైన్ పనులు జరుగుతున్నాయని, రైతులతో కలిసి పనులు పరిశీలించామన్నారు. కోసిగి మండల రైతులకు సాగునీరు అందిస్తే వలసలు వెళ్లకుండా ఇక్కడే వ్యవసాయ పనులు చేసుకుంటూ పలువురికి ఉపాధి కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లెపాడు రామిరెడ్డి, వక్రాణి వెంకటేశ్, నాడిగేని అయ్యన్న, జ్ఞానేష్, జక్కునగేని వెంకటేశ్, చింతలగేని నర్సారెడ్డి, ఈరన్న, సాతనూరు కోసిగయ్య, సొట్టయ్య, బీజేపీ రాముడు, హోళగుంద కోసిగయ్య, అర్జున్, రంగారెడ్డి, గోపాల్, మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

మంత్రాలయం: మహిళల ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. బుధవారం మాధవరం తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో నాయకులు రమాకాంత్‌రెడ్డి, ఉలిగయ్య, పల్లిపాడురామిరెడ్డితో కలిసి మాట్లాడారు. మహిళల సంక్షేమానికి 2025- 26 బడ్జెట్‌లో రూ.432 కోట్లు కేటాయించిందని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించి జీవన నైపుణ్యం పొంది ఆర్థిక శక్తిగా మారాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. తల్లి, చెల్లిని గెంటేసిన జగన్‌రెడ్డికి మహిళలను అక్కా, చెల్లెలు అనే అర్హత లేదన్నారు. ఈసమావేశంలో టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, రఘునాథరెడ్డి, రామకృష్ణ, టిప్పుసుల్తాన్, అడివప్పగౌడు, నర్సరెడ్డి, వెంకటపతిరాజు, జ్ఞానేష్, ఈరన్న, రాజానంద్, విజయ్, పెద్దన్న, మల్లికార్జున, అంజనేయులు, బొజ్జప్ప, చాకలి రాఘవేంద్ర, విజయ్‌కుమార్, నరసింహులు పాల్గొన్నారు.


కోసిగిలో పైపులైన్ పనులను పరిశీలిస్తున్న రాఘవేంద్ర రెడ్డి

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధిత కుటుంబాలకు టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ రాఘవేంద్రరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మాధవరం తన నివాసంలో తెలుగు రైతురాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్‌రెడ్డి , ఉలిగయ్య, పల్లిపాడు రామిరెడ్డి, జ్ఞానేష్, బసలదొడ్డి ఈరన్న ఆధ్వర్యంలో సీఎం సహాయనిధి కింద నాలుగు మండలాల్లోని 28 మందికి మంజూరైన రూ.17.23 లక్షలు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రఘునాథ రెడ్డి, రామకృష్ణారెడ్డి, టీబీ డ్యాం బోర్డు చైర్మెన్ టిప్పు సుల్తాన్, వీరేష్ గౌడు, మల్లికా ర్జున, అడివప్పగౌడు, నర్సరెడ్డి, అంజినేయులు, వెంకటపతిరాజు, జమీర్, రామకృష్ణ, భీమ్‌సింగ్ పాల్గొన్నారు.

18 నుంచి సుయతీంద్రతీర్థుల సమరాధనోత్సవాలు

మంత్రాలయం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పూర్వపు పీఠాధిపతి సుయతీంద్రతీర్థుల 12వ మహాసమరాధనోత్సవాలు ఈ నెల 18 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు మఠం ఏఏవో మాధవ శెట్టి, మేనేజర్లు వెంకటేశ్ జోషీ, సురేష్ కోనాపూర్ తెలిపారు. 18న మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో పూర్వారాధన, 19న మధ్యారాధన, 20న ఉత్తరాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 19న మధ్యారాధనలో బంగారు రథంపై స్వామివారిని అధిష్టించి ఊరేగించనున్నారు. ఉత్తరాధనలో భాగంగా విద్వాన్ బ్రహ్మచారి, విద్వాన్ శ్రీనిధి ఆచార్‌లచే ప్రవచనాలు నిర్వహిస్తారు. 12వ మహాసమరాధనలో భాగంగా సుయతీంద్రతీర్థుల-2025 అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. సుయతీంద్రతీర్థుల ఆరాధనోత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల ఆధునికీకరణపై సమావేశం

మంత్రాలయం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల ఆధునికీకరణ, కొత్త కేంద్రాల గుర్తింపు అనే అంశంపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం ఈనెల 15న నిర్వహించనున్నట్లు ఎన్నికల ఆర్వో అనురాధ, తహసీల్దార్ ఎస్.రవి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జీకే గురురాజా రావు తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో రాజకీయ పార్టీల నాయకులు, నియోజకవర్గ సహాయ ఓటరు నమోదు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలతో పాటు ఓటరు నమోదు అధికారులు పాల్గొని పోలింగ్ కేంద్రాల ఆధునీకరణ, కొత్త కేంద్రం గుర్తింపుపై తమ అభిప్రాయాలను తెలపాలని కోరారు.

యువత పోరు పేరుతో వైసీపీ డ్రామా


మాట్లాడుతున్న తెలుగు యువత నాయకులు

గోనెగండ్ల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గతంలో వైసీపీ ప్రభుత్వం యువతను జాబ్ క్యాలెండర్‌తో మోసం చేసి గద్దె దిగి నేడు యవత పోరు అని డ్రామాలు ఆడుతోందని తెలుగు యువత మండల నాయకులు రంగస్వామినాయుడు, సందీప్‌నాయుడు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, పథకాల డబ్బును విద్యార్థులకు ఇవ్వకుండా మోసగించిందన్నారు. వైసీపీ నాయకులు పోరు చేయాల్సి వస్తే జగన్ ఇంటి ముందు చేయాలని సూచించారు. సమావేశంలో తెలుగు యువత నాయకులు ఐరన్‌బండ బాషా, నాగరాజు, రమేష్‌నాయుడు, రఫీక్, జయపాల్, పెద్దయ్య, ప్రభాకర్‌నాయుడు, వినోద్‌కుమార్‌గౌడ్, మునిస్వామి, దేవేంద్ర, నీలకంఠ, చంద్రన్న, ప్రభుదాస్, రంగారెడ్డి పాల్గొన్నారు.

ప్రజలందరికీ 104 సేవలు అందాలి

గోనెగండ్ల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రజలందరికీ 104 ద్వారా సేవలు అందాలని, అందుకు సిబ్బంది తమ వంతు కృషి చేయాలని జిల్లా 104 నోడల్ అధికారి రఘు కోరారు. బుధవారం గోనెగండ్లలోని మూడో సచివాలయ కేంద్రంలో ఏర్పాటు చేసిన 104 సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు ఉంటే చెప్పాలని కోరారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు రంగారవళి, ఎంపీహెచ్‌వో హనుమంతు, ఏఎన్‌ఎం మాధవి, లక్ష్మి, ఆశావర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతాదారుడిపై చైర్మన్ చిందులు

ఎమ్మిగనూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణం కోసం స్థలాన్ని తాకట్టుపెట్టి రుణం ఇవ్వాలని కోరిన ఖాతాదారునిపై టౌన్ బ్యాంకు చైర్మన్ ఉరుకుందయ్యశెట్టి చిందులేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడు గోపాల్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని సోమప్ప నగర్‌లో నివాసం ఉంటున్న గోపాల్ 25ఏళ్లుగా తనకున్న స్థలం పత్రాలను టౌన్ బ్యాంకులో కుదువపెట్టి రుణం తీసుకోవడం, తిరిగి చెల్లిస్తూ వచ్చాడు. ఆ స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు పనులు మొదలు పెట్టాడు. అందుకుగాను కొంత మొత్తం అవసరం కావడంతో టౌన్ బ్యాంకును ఆశ్రయించాడు. చైర్మన్ ఉరుకుందయ్యశెట్టిని కలిసి తన స్థలం పత్రాలు బ్యాంకులోనే ఉన్నాయని, తీసుకున్న రుణం కూడా తిరిగి చెల్లించానని, ఇల్లు కట్టుకుంటున్నాను రూ.లక్ష వరకు రుణం ఇవ్వాలని కోరాడు. ఇందుకు స్పందించిన చైర్మన్ స్థలం పత్రాలు పరిశీలించి అవహేళనగా మాట్లాడుతూ తనపై చిందులవేశారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. బ్యాంకు చైర్మన్ మాట్లాడిన తీరు సరైందికాదని, ఉన్నతాధికారులు స్పందించి తనకు రుణం వచ్చేలా చూడాలని కోరాడు.

వర్మీకంపోస్టుతో ఆదాయాన్ని పెంచాలి

గోనెగండ్ల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ ఇళ్లలోని తడి, పొడి చెత్తలను పంచాయతీ ఏర్పాటు చేసిన చెత్త బండ్లలోనే వేసే విధంగా పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీవో నూర్జహాన్ సూచించారు. బుధవారం గోనెగండ్లలోని చెత్త సంపద కేంద్ర దగ్గర వర్మికంపోస్టు తయారీ విధానంపై ఒక్క రోజు శిక్షణా ఇచ్చారు. ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల పంచాయతీ కార్యదర్శులు, చెత్తసంపద కేంద్రంలో పనిచేసే సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ వార్డు సభ్యులు ఆయా గ్రామంలో పర్యటించి ప్రతి ఇంటికి తడి, పొడి చెత్తలను వేసుకునేందుకు గాను రెండు ప్లాస్టిక్ డబ్బాలను అందజేయాలని సూచించారు. తడిచెత్త, పొడిచెత్తలతో వర్మీకంపోస్టును తయారు చేయాలని దాంతో పంచాయతీలకు ఆదాయం పెంచాలన్నారు. అనంతరం ఎంపీడీవో మణిమంజరి, ఈవోఆర్‌డీ అనంతశయనతో కలిసి గోనెగండ్లలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, పంచాయతీ కార్యదర్శులు సతీష్, సందీప్, పంచాయతీ శానిటరీ ఇన్స్‌పెక్టర్ మలాంగ్, సుభాన్, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దుదాం

కౌతాళం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): చెత్త రహిత గ్రామంగా తీర్చి మన ఊరిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుదామని కౌతాళం గ్రామ సర్పంచ్ పాల్‌దినకరన్ సూచించారు. బుధవారం కౌతాళంలో చెత్త తరలింపు కార్యక్రమాన్ని ఈఓపీఆర్డీ యోగేశ్వరరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి శివప్పలతో కలిసి సర్పంచ్ గ్రామంలో బీఎస్ఎన్ఎల్ ఆఫీసు, కృష్ణావధూత ఆశ్రమం, తహసీల్దార్ కార్యాలయం వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు.

శిశువు మృతిపై విచారణ

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో శిశువు మృతిపై డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాధవి బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధితుల నుంచి ఫిర్యాదు రావడంతో విచారణ చేపట్టామన్నారు. ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రికి ప్రసవం కోసం రాగా గైనకాలజిస్టు, చిన్న పిల్లల వైద్య నిపుణులు లేకపోవడంతోనే నవజాత శిశువు మృతి చెందిందని బాధితులు తెలిపారన్నారు. పూర్తిస్థాయిలో వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు.

చిన్న పిల్లల ప్రాణాలతో చెలగాటం

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాధవీలత నామమాత్రపు విచారణ చేపట్టారని ప్రజాసంఘాల నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా అడ్వకేట్ తిమ్మప్ప, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజీవ్ మాట్లాడుతూ ప్రభుత్వ డాక్టర్లు డ్యూటీ టైమ్‌లో ఆస్పత్రిలో ఉండకుండా ప్రైవేట్ ఆస్పత్రిలో ఉంటూ ఇక్కడ వైద్యం అంతా స్టాఫ్ నర్సులతోనే చేయిస్తున్నారన్నారు. డెలివరీ తర్వాత పిల్లలకు సీరియస్‌గా ఉంటే డాక్టర్లు ఫోన్‌లోనే రిపోర్ట్ ఇచ్చి వెంటనే కర్నూలుకు రెఫర్ చేయంటూ బాధితుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. డీఎంహెచ్‌వో జోక్యం చేసుకొని వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


విచారణ చేస్తున్న డాక్టర్ మాధవి

జీవన శైలిలో మార్పుతోనే రోగాలు


వైద్య, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వైద్యుడు

ఎమ్మిగనూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జీవనశైలిలో మార్పులు, మారిన ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడం, కాలుష్యం వంటి కారణాలతో క్యాన్సర్ బాధితులు పెరగానికి అవకాశం ఉందని జిల్లా సంచార చికిత్స నోడల్ అధికారి డాక్టర్ రఘు తెలి పారు. బుధ వారం పట్టణంలోని ఖ్యుబులా క్వార్టర్‌లో ఉన్న సచివాలయంలో మహిళా ఆరోగ్య కార్యకర్తలకు ఎంసీడీ-సీడీ వ్యాధుల స్క్రీనింగ్ పురోగతులపై సమీక్ష నిర్వహించి ఆరోగ్య కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. సమావేశంలో వైద్యులు నిస్సోగ్రేష్, సాయి జాహ్నవి, శ్రీనివాసబాబు, వీణా, ఎంపీహెచ్‌ఈవో విజయ్‌కృష్ణ, ఆరోగ్య కార్యకర్తలు, ప్రొజెక్టనిస్టు ఖలీల్, జిల్లా వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వస్తువుల తొలగింపు

గోనెగండ్ల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గంజహళ్లి గ్రామం శివార్లలో బుధవారం పంచాయతీ సిబ్బంది ప్లాస్టిక్ వస్తువులను తొలగించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'ప్లాస్టిక్ నిషేధం ప్రకటనకే పరిమితం' అన్న శీర్షిక వార్త ప్రచురితమైంది. ఇందుకు పంచాయతీ అధికారులు స్పందించారు. బుధవారం ఉదయం పంచాయతీ సిబ్బంది శివార్లలో పడి ఉన్న ప్లాస్టిక్ వస్తువులను ఆ ప్రాంతం నుంచి తొలగించి శుభ్రం చేశారు. అ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామంలో ప్లాస్టిక్ వస్తువుల పై ప్రజలకు దుకాణదారుకులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

షాపులకు బహిరంగ వేలం

కోసిగి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోసిగిలోని ఆంజనేయస్వామి (కోసిగయ్య) గుడి దేవస్థానం సంబంధించి బుధవారం కోసిగిలోని తేరుబజారు మైదానంలో ఉన్న అంజనేయస్వామి (కోసిగయ్య) గుడికి సంబంధించిన షాపులను దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ఏ.సాయి కుమార్ ఆధ్వర్యంలో బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. మొత్తంగా 49 షాపులకు వేలం వేశారు. తనిఖీ అధికారి పీసీ రాంప్రసాద్, దేవాదాయ శాఖ అధికారులు, ప్రధాన అర్చకుడు శ్రీరాములు, దుకాణదారులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం ధ్వంసం


మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న ట్రాక్టర్

కోసిగి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కోసిగి ఎక్సైజ్ స్టేషన్, కోసిగి, కౌతాళం పోలీస్ స్టేషన్లకు సంబంధించిన మొత్తం 105 కేసుల్లోని 2,442 లీటర్ల కర్ణాటక మద్యంను బుధవారం కోసిగి మార్కెట్ యార్డులో ట్రాక్టరు ద్వారా తొక్కించి ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సీఐ భార్గవరెడ్డి, ఎస్ఐ కార్తిక్‌సాగర్, కోసిగి ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో సుమారు రూ.12,27,600 విలువ గల సీజ్ అయిన కర్ణాటక మద్యం ధ్వంసం చేశామన్నారు.

ఆటో కార్మికులకు సామాజిక పింఛన్ ఇవ్వాలి


యూనియన్ గుర్తింపు కార్డులు చూపుతున్న ఆటో కార్మికులు

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): యాభై సంవత్సరాల వయస్సు దాటిన ఆటో కార్మికులకు సామాజిక పింఛన్ ఇవ్వాలని ఆటో యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ కార్యాలయంలో ఆటో కార్మికులకు యూనియన్ గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారిన ఆటో కార్మికులకు ఎటువంటి సామాజిక పథకాలు కేటాయించకపోవడం చాలా విచారకరమన్నారు. ఈ బడ్జెట్ లోనైనా ఆటో కార్మికులకు సామాజిక పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సురేష్, ఆమోస్, ఆంజనేయులు, నరసన్న తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


భక్తులకు తాగునీరు సరఫరా చేస్తున్న డిప్యూటీ కమిషనర్

కౌతాళం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో బుధవారం ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ వేసవి కావడంతో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముందుగా దర్శనానికి వచ్చిన భక్తులకు ఈఓ స్వయంగా తాగునీరు అందించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, మహదేవప్ప స్వామి అర్చకులు ఆలయ అధికారులు మల్లికార్జున, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చూడి-కరణి వరకు రోడ్డు వేయాలి

కౌతాళం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చూడి గ్రామం నుంచి కరణి గ్రామానికి రోడ్డు వేసి రవాణ సౌకర్యం కల్పించాలని సీపీఎం మండల కన్వీనర్ ఈరన్న, సీనియర్ నాయకుడు మల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రను చూడి గ్రామంలో చేపట్టారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం రోడ్డు గుంతలమయంగా ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే చూడి-కరణి గ్రామాల మధ్య రోడ్డు వేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామాంజనేయులు, ఉలిగయ్య, బసవరాజు, ప్రకాష్, వీరేష్ పాల్గొన్నారు.